ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న తొలి తెలంగాణ దినపత్రిక

APTEL/2011/39851

# సామాజిక తెలంగాణ

జాతీయ దినపత్రిక

epaper.samajikatelangana.in




Published from Hyderabad | సంపుటి: 14 | సంచిక: 207 | శుక్రవారం 13-03-2026 | ఎడిటర్: పి.వెంకటరమణ | పేజీలు: 12 | వెల రూ. 5/-




# తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా


- తనకు ఎలాంటి భేదభావాలు లేవని ప్రకటన
- నిబంధనల మేరకే నడచుకున్నానని వెల్లడి



న్యూఢిల్లీ

విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తిరిగి స్పీకర్ స్థానంలోకి వచ్చారు. అలాగే ఆయన తన పనితీరుపైనా స్పందించారు. ప్రతి ఎంపీకి లోక్‌సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయి. ప్రధాని, మంత్రులు కూడా ఏవయినా ప్రకటనలు చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలి. మైక్రోఫోన్లు ఆన్ లేక ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద ఎలాంటి బటన్ ఉండదు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుంది' అని తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తోన్న విమర్శలకు బిర్లా సమాధానం ఇచ్చారు. రెండ్రోజుల చర్చ అనంతరం

-మిగతా 2 లో




# యుద్ధం ఆపేస్తాం

- కానీ మూడు షరతులున్నాయి
- యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే
- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు

టెహ్రాన్,

ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

-మిగతా 2 లో




## బీఆర్ఎస్ ఫిరాయింపు
# ఎమ్మెల్యేల కేసు క్లోజ్

- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ, సామాజిక తెలంగాణ

తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం

-మిగతా 2 లో

## ప్రపంచానికే వైద్య సేవలు
# అందించాలి

## ఆ దిశగా రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది

- ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి
- మానవతా దృక్పథంతో వైద్యం అందించాలి
- ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలి
- మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవ్వాలి
- మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో సీఎం

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

మణికొండ సామాజిక తెలంగాణ

విద్య, వైద్యం, వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచానికి వైద్య సదుపాయం అందించే కేంద్రంగా మన రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి రాష్ట్రంలోనే జరుగుతోందని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రపంచవ్యాప్తంగా నాలుగు కోవిడ్ టీకాలు ఉత్పత్తి అయితే అందులో మూడు టీకాలు మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేశామని తెలిపారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యులు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు.వైద్యులు, వైద్య సిబ్బంది ప్రవర్తన ద్వారా కూడా రోగి ఎంతో ఉపశమనం పొందుతాడని అన్నారు.

-మిగతా 2 లో






## తెలంగాణలో కమర్షియల్
# సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,సామాజిక తెలంగాణ

తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్

-మిగతా 2 లో

# దేశంలో గ్యాస్ సంక్షోభం

- కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ
- పరిస్థితులపై అధికారుల సమీక్ష




2 లో

# 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

హైదరాబాద్ సామాజిక తెలంగాణ

పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. -మిగతా 2 లో




## యుద్ధ సంక్షోభంలో
# భారత్ తొలి విజయం



- హర్మ్యూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్న షెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక

ముంబై, సామాజిక తెలంగాణ

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ఒక చమురు నౌక హర్మ్యూజ్‌ను దాటి భారత్‌కు చేరుకుంది. ఎటువైపు నుంచి క్షిపణి దూసుకొస్తుందో తెలియని ఘర్షణ వాతావరణంలో జలసంధిని సురక్షితంగా దాటి, ముంబయి పోర్ట్‌కు చేరుకున్న తొలినౌక ఇదే కావడం విశేషం. అయితే హర్మ్యూజ్ నుంచి రావడానికి ఇరాన్ పరోక్షంగా సహకరించిందని సమాచారం.

-మిగతా 2 లో

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

(మొదటి తరువాయి)

అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్క్వాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

(మొదటి తరువాయి)

హర్మూజ్ అంతరాయాలతో భారత్‌లో ఇంధన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో షెన్‌లాంగ్ విజయవంతంగా దేశానికి చేరడం, మరోవైపు భారత పతాక నౌకలు హర్మూజ్‌నుంచి వెళ్లొచ్చని ఇరాన్ అనుమతిచ్చినట్లు వార్తలు రావడం ఊరటనిస్తోంది. దీనిని నడిపిన కెప్టెన్ కూడా ఇండియనే. లైబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ చమురు ట్యాంకర్ బుధవారం ముంబయి నౌకాశ్రయానికి చేరుకుంది. మూడు రోజుల క్రితమే అది హర్మూజ్ ను దాటింది. తన ప్రయాణాన్ని ఎవరూ ట్రాక్ చేయకుండా చురుగ్గా వ్యవహరించింది. మార్చి ఒకటిన ఈ ట్యాంకర్ సౌదీ అరేబియా పోర్ట్ వద్ద చమురు లోడ్ చేసుకుంది. మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. దాని సిగ్నల్స్ మార్చి 8న హర్మూజ్‌లో కనిపించాయి. ఆ తర్వాత అది జాడలేకుండా పోయింది. నౌకలోని సిబ్బంది ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ , ట్రాన్స్‌పాండర్లను స్విచ్ఛాఫ్ చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం అడుగడుగునా ప్రమాదకరంగా మారిన హర్మూజ్‌లో గుర్తింపు తెలియకుండా సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. జలసంధిని దాటి ఇండియా దిశగా ప్రయాణిస్తున్నప్పుడు.. అంటే ఒకరోజు తర్వాత మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్స్‌లో ఈ షిప్ కనిపించింది. సంక్షోభ సమయాల్లో ప్రత్యర్థులకు చిక్కకుండా ఉండేందుకు అసాధారణ పరిస్థితుల్లో షిప్పింగ్ కంపెనీలు ఈ టెక్నిక్‌ను వాడుతుంటాయి. దీనిని గోయింగ్ డార్క్ గా చెప్తుంటారు. అంతర్జాతీయ సముద్రయాన నిబంధనల ప్రకారం.. భద్రత, రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఏఐఎస్‌ను ఎప్పుడూ యాక్టివ్‌గానే ఉంచాలి. ఇక, ఇప్పుడు ముంబయికు షెన్‌లాంగ్.. 1,35,335 మెట్రిక్ టన్నుల చమురును మోసుకొచ్చింది. గ్రీస్‌లోని డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఈ నౌక కార్యకలాపాలు చూస్తోంది. 29 మంది సిబ్బందిలో భారతీయులతో సహా పాకిస్థాన్, ఫిలిప్పీన్స్ జాతీయులు ఉన్నారు. కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సింధు భారతీయుడే కావడం విశేషం.

## బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

(మొదటి తరువాయి)

లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇష్టపికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

## తిరిగి స్పీకర్ స్థానంలో విధులకు ఓంబిర్లా

(మొదటి తరువాయి)

బుధవారం సాయంత్రం విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మూజువాణి ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్న స్పీకర్ అది వీగిపోగానే మళ్లీ యథావిధిగా తన బాధ్యతలు చేపట్టారు.

### తెలంగాణలో కమర్షియల్
## సిలిండర్ల కొరత

(మొదటి తరువాయి)

సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# ప్రపంచానికే వైద్య సేవలు అందించాలి

(మొదటి తరువాయి)




రాష్ట్రంలో మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలని, అప్పుడే ఆయా కుటుంబాలు పుష్టిగా ఉంటాయని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా నానక్‌రామ్‌గూడలోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ పరిధిలో మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్ రఘువీర్ రెడ్డి, మెడికవర్ ఆస్పత్రి చైర్మెన్ అనిల్ కృష్ణతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం ప్రసంగించారు. మెడికవర్ ఆస్పత్రి 2014లో ప్రారంభమై 12 ఏండ్లుగా ఉత్తమ సేవలు అందించడం వల్లనే దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. మానవత్వంతో కూడిన వైద్య సదుపాయం అందించినప్పుడే రోగులు సంతృప్తి చెందుతారని తెలిపారు. 550 బెడ్లు, 18 ఆపరేషన్ థియేటర్లతో ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫార్మా ఇండస్ట్రీలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మందుల ఉత్పత్తిలో మన రాష్ట్రానికి 40 శాతం వాటా ఉందన్నారు. వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రయివేట్ వైద్యులు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడాదిలో కనీసం ఒక నెల పనిచేయాలని అన్నారు. అప్పుడే వైద్యులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆస్పత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఇటువంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎంతో సహాయపడతాయని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జి. అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించామని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ.. 640–స్లైస్ సీటీ స్కాన్, వేగవంతమైన హార్ట్ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో ఖచ్చితమైన నిర్ధారణ చేసి రోగులకు సమయానికి చికిత్స అందించొచ్చని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరికృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయి వైద్య సేవల అవసరం పెరుగుతోందని, ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డైరెక్టర్ డా. ఎ.ఆర్. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ఆధునిక వైద్య పరికరాలు, సమగ్ర వైద్య విధానాలతో ఈ ఆస్పత్రి రోగులకు వేగవంతమైన, సమర్థవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# యుద్ధం ఆపేస్తాం

(మొదటి తరువాయి)

పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

# దేశంలో గ్యాస్ సంక్షోభం

**కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ**
**పరిస్థితులపై అధికారుల సమీక్ష**




**న్యూఢిల్లీ,**

పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయీ' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

### ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో
## ఆర్టీసీని ప్రయివేటీకరించే కుట్ర

(మొదటి తరువాయి)

హరీశ్‌రావు హామీ ఇచ్చారు. ఒకవైపు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సంస్థను కాపాడుకోవాలని కార్మికులు పోరాడుతున్నారని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఒక్కొక్క విభాగాన్ని ప్రయివేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ పేరుతో ఎలక్ట్రిక్ బస్సుల తయారీని కార్పొరేట్ శక్తులకు అప్పగించి, వారికే సబ్సిడీలు ఇస్తూ ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నదని అన్నారు. ప్రయివేట్ కంపెనీలతో ఏకంగా రెండు వేల బస్సుల సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నదని వివరించారు. ఎలక్ట్రిక్ బస్సుల ముసుగులో ఆర్టీసీని ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ కంకణం కట్టుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీలను నేరుగా ఆర్టీసీకే ఇప్పించి, సంస్థ సొంతంగా బస్సులు కొనుగోలు చేసుకునేలా పథకంలో సవరణలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జీరో టికెట్ అమలు కోసం ప్రతినెలా రూ.350 కోట్లు చెల్లిస్తామంటూ ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. ఇపుడు అరకొర నిధులు చెల్లించి చేతులు దులుపుకోవడం శోచనీయమని విమర్శించారు. గత రెండేండ్లుగా ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిల భారాన్ని ఆర్టీసీపైనే మోపడం వల్ల సంస్థ ఆర్థికంగా కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఇప్పటికీ రెండు పీఆర్సీలు పెండింగ్‌లో ఉన్నాయనీ, 2025 పీఆర్సీ సైతం అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులు క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న పొదుపు మొత్తాలకు కాంగ్రెస్ ప్రభుత్వం 23 నెలలుగా వడ్డీ చెల్లించడం లేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణం పథకం సజావుగా సాగుతోందని డబ్బా కొట్టుకుంటున్న ప్రభుత్వం రద్దీకి సరిపడా కొత్త బస్సులు కొనడంలో, సిబ్బందిని నియమించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సిబ్బంది కొరతతో ఉన్న కార్మికులపై తీవ్ర పని భారం పడుతోందనీ, ఆ ఒత్తిడి వల్ల కార్మికులు తీవ్రమైన అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని వివరించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## మన విదేశాంగ విధానం అమెరికాకు తకాట్టు

(మొదటి తరువాయి)

ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హోర్ముజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు. యూఎస్ అనుమతి లేకుంటే ముడి చమురు కొనుగోలు చేయ్యారా? అంటూ వ్యంగ్యంగా కేంద్రాన్ని నిలదీశారు. భారత్ వంటి పెద్ద దేశానికి మరో దేశం అనుమతి అవసరమా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. పెట్రోలియం మంత్రికి ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చేసిన వెంటనే రాహుల్ మైక్‌ను స్పీకర్ ఓం బిర్లా కట్ చేశారు. అంతలో సభలోని హర్దీప్ సింగ్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# మార్చ్ 14 న భీంగల్ కు రానున్న ప్రసిద్ధ వేద విద్వాంసులు..

### సమన్వయకర్త కంకణాల రాజేశ్వర్ వెల్లడి..

**ఆర్మూర్,మార్చి 12 ( సామాజిక తెలంగాణ):** భీంగల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీవాసుల ప్రత్యేక ఆహ్వానం మేరకు మార్చ్ 14 శనివారం ఉదయం 10 గంటలకు "హనుమాన్ చాలీసా శతవారాల పారాయణ మహోత్సవ" సందర్భాన్ని పురస్కరించుకొని భీంగల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన "ఆధ్యాత్మిక అమృత భాషణం మహాసభ" కు అంకాపూర్ వైదిక ధ్యానయోగ ఆశ్రమం వ్యవస్థాపకులు,సుప్రసిద్ధ కవి, ప్రఖ్యాత వేద విద్వాంసులు,ఖ్యాతినొందిన ధార్మిక రచయిత, అనువాదకులు, మార్గదర్శకులు,చిత్రకారుడు, ప్రముఖ ఆధ్యాత్మిక వక్త శ్రీశ్రీశ్రీ శ్రీధరానంద భారతీ స్వామి వైదిక పురోహితులు,ధార్మిక వక్త, గాయకులు,ధర్మ ప్రబోధకులు శ్రీశ్రీశ్రీ వేద పునీతానంద భారతీ స్వామి రానున్నారని కార్యక్రమ




వారధి, సమన్వయకర్త,వ్యాఖ్యాత కంకణాల రాజేశ్వర్ మరియు విద్యానగర్ కాలనీ ప్రతినిధులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ శుభ సందర్భంగా ఆధ్యాత్మిక ధర్మ ప్రచారకులు కంకణాల రాజేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ హనుమాన్ చాలీసా అనేది 16వ శతాబ్దంలో తులసీదాస్ రాసిన 40 పద్యాల హనుమంతుని స్తోత్రం అని అన్నారు. అంతేకాకుండా హనుమాన్ చాలీసా చదవడం వలన హనుమంతుని ఆశీస్సులతో కష్టాలు తొలగిపోయి, బలం,బుద్ధి, విద్యను ప్రసాదిస్తుంది అని అన్నారు. మానసిక ప్రశాంతతతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని వివరించారు. శ్రీరాముని పట్ల అచంచలమైన భక్తి కలిగి పూర్తి అర్థంతో,భక్తితో హనుమాన్ చాలీసాను చదివినట్లయితే మెరుగైన ఫలితాలు లభిస్తాయి అని సవివరించారు. కాబట్టి భీంగల్ పట్టణ ప్రజలతో పాటు ఇరుగుపొరుగు గ్రామాల హైందవులు,రామభక్తులు, ధార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేసి అన్నప్రసాదాన్ని స్వీకరించగలరని కంకణాల రాజేశ్వర్, విద్యానగర్ కాలనీ ప్రతినిధులు కోరారు.

# పసుపు ధర పతనం యుద్ధం లేదా మార్కెట్ పరిస్థితుల ప్రభావం

### ధరల మార్పులతో రైతుల్లో ఆందోళన

**జగిత్యాల, సామాజిక తెలంగాణ జిల్లా ప్రతినిధి:** చెమటోడ్చి పండించిన పంటకు సరైన ధర దక్కుతుందనే ఆశతో ఉన్న పసుపు రైతులకు, మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న ధరల మార్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఆశాజనకంగా కనిపించిన పసుపు ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టడంతో, రైతులలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి వెనుక నిజంగా అంతర్జాతీయ ప్రభావమా లేక స్థానిక మార్కెట్ పరిస్థితుల ప్రభావమా? అన్న చర్చ వినిపిస్తున్నట్లు సమాచారం.

**ధరల మార్పులతో రైతుల్లో ఆందోళన**

కొద్ది రోజుల క్రితం వరకు క్వింటాల్ పసుపు ధర 13,500 నుంచి 14,500 వరకు పలికినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు ధర క్వింటాల్‌కు సుమారు 10,000--12,500 మధ్య పలుకుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ధరల మార్పులు రైతుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయని వారు చెబుతున్నారు.

**చిన్న కుప్పలకు ఎక్కువ రేట్ గందరగోళం**



కొన్ని సందర్భాల్లో 20 కి లోపు కిలోల చిన్న కుప్పలకు మాత్రమే అధిక ధర వస్తుంది, అయితే ఆ రోజు మొత్తం మార్కెట్ కోసం అదే ధర ఎక్కువగా ప్రకటించబడుతుంది. ఈ విధంగా మార్కెట్ పరిస్థితులు రైతుల్లో అస్పష్టత సందేహాలు సృష్టిస్తున్నాయి

**పెరిగిన పెట్టుబడులు. వచ్చే సంవత్సరం కోసం ఖర్చు**

ఈ సంవత్సరం పసుపు ధరలు పెరిగిన నేపథ్యంలో, పసుపు సాగుకు అవసరమైన ఎరువుల ధరలు కూడా పెరిగినట్లు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా గొర్రెల ఎరువు సరఫరాదారులు కూడా ధరలు పెంచినట్లు రైతులు పేర్కొన్నారు. రైతులు సాధారణంగా రాబోయే సంవత్సరం సాగు కోసం ముందుగానే గొర్రెల ఎరువును కొనుగోలు చేసి నిల్వ ఉంచుతారని చెబుతున్నారు. 10 టైర్ లారీ గొర్రెల ఎరువు ధర సుమారు 38,000. 12 టైర్ లారీ గొర్రెల ఎరువు ధర సుమారు 48,000

**అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావమా**

ధరల తగ్గుదలకు కొందరు వ్యాపార వర్గాలు ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న యుద్ధ పరిస్థితులను కారణంగా పేర్కొంటున్నట్లు సమాచారం. రవాణా వ్యయాలు, ఎగుమతుల పరిస్థితులు వంటి అంశాలు మార్కెట్‌పై ప్రభావంచూపవచ్చని వారు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశాలపై స్పష్టత కావాలని రైతు వర్గాలు చెబుతున్నారు.

**పసుపు బోర్డు ఆశలు**

ఇటీవల పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పసుపు ధరల విషయంలో వాస్తవ పరిస్థితులు స్పష్టంగా తెలియాలి, రైతులకు న్యాయమైన ధర దక్కేలా పరిస్థితులు రావాలి అని రైతులు కోరుతున్నారు.

# పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

### ప్రతి విద్యార్థి కష్టపడి చదువుతూ ఎదగాలి
### విద్యార్థికి క్రమశిక్షణ అనేది ముఖ్యం
### మండల విద్యాధికారి సుజాత
### సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్

**సామాజిక తెలంగాణ టేక్మాల్ ప్రతినిధి**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మెట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారంనాడు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులను సర్పంచ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ మండల విద్యాధికారి సుజాత గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు విద్యార్థులకు వీడ్కోల సమావేశాన్ని నిర్వహించారువారు వీడికోల సమావేశాల్లో విద్యార్థులు స్పీచ్లో తమ నృత్యాలను నలుగురిని ఆకట్టుకున్నాయి అనంతరం వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదువుతూ తమ లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు ఎదగాలని అప్పుడే వారి యొక్క గమ్యాన్ని చేరుకోగలుగుతారని వారు గుర్తు చేశారు విద్యార్థి యొక్క దశ పదో తరగతి నుంచి మొదలవుతుందని తొలిమెట్టి ఈ దశ అని తెలిపారు క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థికి చాలా ముఖ్యమని అన్నారు పదో తరగతి వార్షిక






పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించినప్పుడే పేరు తెచ్చిన వారవుతారు అన్న విద్యార్థులకు తెలుగు లెక్చరర్ అయిన మైబుద్ పాషా తన వంతు సహాయంగా ఆటో చార్జీలుగా ఒక్కొక్క విద్యార్థికి 500 చొప్పున అందజేశారు ఇటీవల పదవ తరగతి విద్యార్థి తండ్రి హార్ట్ ఎటాక్



తో చనిపోవడంతో ఆ విద్యార్థికి ఐదువేల హార్దిక సహాయాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు లతా గ్రామస్తులు వినోద్ రవిశంకర్ నరసింహులు నాగభూషణం భూషణం పెంటయ్య ధనంజయ ఉపాధ్యాయులు కృష్ణ అశోక్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు

# పసుపు,ఎర్రజొన్న వ్యాపారులు సిండికేట్ గా మారుతున్నారు..

### అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.ప్రభాకర్,కార్యదర్శి బి. దేవరాం..




**ఆర్మూర్,మార్చి 12 (సామాజిక తెలంగాణ):** ఆర్మూర్ ప్రాంతంలో రైతులు పండించిన ఎర్రజొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి ప్రభాకర్,రాష్ట్ర కార్యదర్శి బి.దేవరామ్ చెప్పారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మొక్కజొన్నలను మార్చి 15లోగా రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని చెప్పారు. పసుపు, ఎర్రజొన్న వ్యాపారులు సిండికేట్ గా మారి ధరలను కృత్రిమంగా తగ్గిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ విషయాన్ని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఎర్ర జొన్నలను క్వింటాలుకు రూ.4 వేలకు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోడీ కార్పొరేట్ భజన చేస్తూ ఎంఎస్ పి అమలు చేయకుండా నీరుగారుస్తున్నారని ఎద్దేవా చేశారు. అమెరికా,భారత్ వాణిజ్య ఒప్పందంతో 11 శాతం పైగా ఉన్న దిగుమతి సుంకాలు రద్దుచేసి ఎగుమతి సుంకాలను 50 శాతం అంగీకరించి దానిని తగ్గించామని చెబుతున్నారన్నారు. దిగుమతి సుంకాలను జీరో చేసినప్పుడు,ఎగుమతి సుంకాలను సైతం జీరో చేయాలని డిమాండ్ చేశారు. వాణిజ్య ఒప్పందం రైతు వ్యతిరేకంగా ఉన్నందున దీన్ని రద్దుచేసి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వ్యాపారలు,రైతులు,రైతు ప్రతినిధులతో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కిషన్,ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల గంగారాం,జిల్లా ఉపాధ్యక్షులు యు.రాజన్న,నాయకులు లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలి..

### సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి..



**ఆర్మూర్,మార్చి 12 (సామాజిక తెలంగాణ):** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి అనుకున్నది సాధించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి చెప్పారు. ఆర్మూర్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ హై స్కూల్ లో వార్షికోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. న్యాయమూర్తి శ్రీదేవిని పాఠశాల కరస్పాండెంట్ థామస్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంగీత కాందేశ్,బొచ్కర్ వీణ, ప్రిన్సిపాల్ సిస్టర్ సుమలత, ఉపాధ్యాయులు గీత,అశ్విని, లక్ష్మీనారాయణ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ ఈఓ ను ఏర్పాటు చెయ్యాలి..

### వార్డ్ సభ్యుడు ముడుగు ప్రవీణ్..



**సామాజిక తెలంగాణ మార్చి 12 గురువారం మంచిర్యాల జిల్లా** జన్నారం మండల పొన్కల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పదవి దాదాపు గత 4 సం నుండి ఇంచార్జీ ఈఓ వుండటం వాళ్ళ అనుభవం ఉన్న మరియు రెగ్యులర్ ఈఓ ను ఏర్పాటు చెయ్యాలి అని వారు అన్నారు దాని ద్వారా గ్రామ పంచాయతీ అభివృద్ధి కీ మార్గం సుగమం అవుతుంది పొన్కల్ గ్రామ పంచాయతీ లో సుమారు 10వేల మంది ప్రజలు ఉన్నట్లు వారి యెక్క ప్రయోజనం దృష్టి లో పెట్టుకొని వారి సౌకర్యార్థం రెగ్యులర్ ఈఓ ను ఏర్పాటు చెయ్యాలి అని 11 వార్డ్ మెంబర్ మూడుగు ప్రవీణ్ జిల్లా అధికారులను కోరారు

## టీజీఎస్పీడీసీఎల్ నల్గొండ సర్కిల్ సూపర్డెంట్ఆఫ్ ఇంజనీర్ బడా
# కాంట్రాక్టర్లుచేతిలో బంది అయ్యి కూర్చున్న వైనం






**నల్గొండ బ్యూరో మార్చ్ 12 (సామాజిక తెలంగాణ)**
రిటైర్మెంట్ దగ్గర ఉన్నందువల్ల బడా కాంట్రాక్టర్లు సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ ను బెదిరిస్తూ అందిన కాటికి దోచుకుంటున్న వైనం నాలుగు కోట్ల బడ్జెట్ రూపాయలు నేను చెప్పిన వానికే పెట్టాలి నాకు నచ్చిన వారికి పెట్టాలి కానీ నాకు తెలియకుండా ఏ చిన్న కాంట్రాక్టర్ కు రూపాయ కూడా పెట్టిన నీ రిటైర్మెంట్ టైం దగ్గరలో ఉన్నది నేను నీ మీద యాక్షన్ తీసుకున్నచో నీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ మొత్తం నా చేతిలోనే ఉన్నాయి మీ పై అధికారులు మొత్తం నా చేతుల్లోనే ఉన్నారు నేను చెప్పినట్టు పని చెయ్ ఏమి దిక్కుతోచకుండా బడా కాంట్రాక్టర్ వచ్చిన బడ్జెట్ను బడా కాంట్రాక్టర్లు కట్టబెట్టడం జరుగుతుంది సూపర్డెంట్ ఆఫ్ ఇంజనీర్ మరియు బడా కాంట్రాక్టర్లు చెప్పుచేతుల్లో ఉండి పనిచేయాలి లేకపోతే మిమ్ములను ఎవరు కూడా వదిలిపెట్టను అని చెప్పడం జరిగింది అని ఆఫీసులో ఎస్టిమేషన్ల మీద సంతకాలు పెట్టమంటే ఒక రేట్ పిక్ చేసుకుని సంతకాలు పెట్టడం లేదు అగ్రిమెంట్లు సంతకాలు పెట్టకుండా కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి దీనికి సంబంధించిన ఎవరైనా అడిగితే నేను ఒక రేటు పెట్టుకున్నాను అవి ఇచ్చిన వరకే సంతకాలు పెడతాడని అధికారులు గుసగుసమని వినిపిస్తున్నాయి

**చక్రం తిప్పుతున్న సర్కిల్ ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్**
సొంత బావ కాంట్రాక్టర్ గా మార్చి ఆపరేషన్ ఏ ఈ లకు ఏడీలకు నా మనిషి వస్తాడు మీరు అతనికి అతనికి వర్కులు ఇయ్యాలి లేకపోతే సర్కిల్ ఆఫీస్ లో ఏ సెక్షన్ లో మీ పని కానివ్వను అని గుసగుసలు వస్తున్నాయి గతంలో చాలామంది కాంట్రాక్టర్లు ఎస్పీ గారికిపలుమార్ల లెటర్లు ఇచ్చిన పట్టించుకోని వైనండివిజన్ డి ఈలకు? వినపత్రం ఇచ్చారు కానీ ఎస్పీ గారు దాన్ని తుంగలో తొక్కేశారు అని వాపోతున్నారు కాంట్రాక్టర్లు

---

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**యాదాద్రి జిల్లా ప్రముఖ న్యాయ వాది సామ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో**

**ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు**

**హాజరైన పలువురు మైనారిటీ ప్రముఖులు**





**భువనగిరి,మార్చ్ 12 సామాజిక తెలంగాణ**
యాదాద్రి భువనగిరి జిల్లా పట్టణ ప్రముఖ న్యాయవాది, సామ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం మైనారిటీ సోదరులకు ముస్లిం మైనారిటీ షాదీ ఖానా లో
ఇఫ్తార్ విందును, ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కుల మతాలకు అతీతంగా ముస్లిం మైనార్టీలకు సోదర భావంతో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.అదేవిధంగా పవిత్ర రంజాన్ మాసంలో,ఎంతో కఠోరంగా ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకు ముందుగా రంజాన్ శుభాకాంక్షలు ఈద్ ముబారక్ తెలిపారు.అలాగే భువనగిరి పట్టణ, ప్రజలపై అల్లా దీవెనలు ఉండాలని ప్రతి ఒక్కరు సుఖ సంతోషా లతో రంజాన్ పండుగను జరుపుకోవాలని కోరారు.అలాగే మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ యాదాద్రి జిల్లా అధ్యక్షులు ఇంతియాజ్ మాట్లాడుతూ గంగ జమున తహేజీబ్ లాంటి పండుగ వాతావరణం గత ఏండ్ల నుండి భువనగిరి లో కొనసాగుతుందని దానికి నిదర్శనం ప్రముఖ అడ్వకేట్ సామ రాజేందర్ రెడ్డి అని అన్నారు.అదే విధంగా కుల మతాలకు అతీతంగా తన దగ్గరికి వచ్చే క్లయింట్ లకు ఉచితంగా సేవలు అందిస్తున్నారని వారు ఇచ్చిన ఇఫ్తార్ విందు దేవుడు స్వీకరించాలని అన్నారు. వారికి వారి కుటుంబానికి అల్లాహ్ ఆశీస్సులు ఎప్పటికి ఉంటాయని అన్నారు.అలాగే ఎల్లప్పుడూ ముస్లిం, మైనార్టీలకు ఇతర వర్గాల వారికి న్యాయపరంగా అందుబాటులో ఉంటారని తెలిపారు. హిందూ ముస్లిం బేదాభిప్రాయం లేకుండ అందరు కలిసి మెలిసి ఉండాలని ఇఫ్తార్ పార్టీ లో విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో 8వ వార్డు,కౌన్సిలర్ మజహార్ బబ్లు,ఎండీ ఇస్తియాక్ అహ్మద్ శేక్ మీరా రజా హుస్సేన్,ఎండీ రహీం,ఎండీ అంజాద్,ఎండీ సల్మాన్,ఎండీ ఆసిఫ్,ఎండీ ఇస్మాయిల్ ఎండీ రహీం ముత హర్ మాసూద్,ఇస్తియాక్ నాజిమ్,రహీం అంజాద్ అహ్మద్,ఎండీ రిజ్వాన్,ఎండీ వసీమ్,ఎండీ మసి, తదితరులు పాల్గొన్నారు.

---

# ఘనంగా గంగమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ట మహోత్సవం

**-మూడు రోజులపాటు పూజా కార్యక్రమాలతో ప్రతిష్ట వేడుకలు.**

**-పెద్ద సంఖ్యలో బోనాల సమర్పణతో పాల్గొన్న భక్తులు.**





**పెబ్బేరు, మార్చి 12 (సామాజిక తెలంగాణ) :**
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ మిట్ట ఆంజనేయస్వామి దేవాలయానికి చేరువలో గంగమ్మ తల్లి దేవాలయం ప్రతిష్ట మహోత్సవాన్ని పెబ్బేరు పట్టణంలోని వివిధ ఉత్సవ కమిటీలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుమారు మూడు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఆలయ ప్రాణ ప్రతిష్ట మహోత్సవానికి ఐదు మంది పురోహితులతో మార్చి 10 మంగళవారం ఉదయం 9 గంటల నుండి యాగశాల ప్రవేశం, విగ్రహాల జలాధివాసం, ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలతో ప్రారంభమై రెండవ రోజు బుధవారం గణపతి, నవగ్రహ, వాస్తు, కలశ, దుర్గ హోమాలతో పాటు గంగాదేవి విశేష యజ్ఞాన్ని నిర్వహించి, పెబ్బేరు పట్టణ ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. మూడవరోజు గురువారం హోమాలు, గంగమ్మ తల్లి యంత్ర ప్రతిష్టాపన, అనంతరం విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, మహా మంగళహారతి, రెండు గంటల నుండి పెబ్బేరు పట్టణ ముదిరాజ్ మహిళలచే బోనం సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గంగమ్మ తల్లి దేవాలయం ఉత్సవ కమిటీ, పెబ్బేరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, మహాత్మ జ్యోతిరావు పూలే ముదిరాజ్ యువజన సంఘం, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వేడుకలు





**సామాజిక తెలంగాణ పత్రిక, జమ్మికుంట ప్రతినిధి -- మార్చి 12:**
జమ్మికుంట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవి మాత ఆలయంలో ఈరోజు సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ సభ్యులు అందరూ కలిసి ఆటపాటలు, వినోద కార్యక్రమాలతో మహిళా దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని, ఉత్సాహంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ గర్రెపల్లి అరుణాదేవి, జోన్ చైర్ పర్సన్ అఖిలాండం, క్లబ్ ప్రెసిడెంట్ ఐతా శ్రీలత, సెక్రటరీ చౌకారపు జ్యోతి, ట్రెజరర్ మద్ది సురేఖ మరియు వాసవి వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---

# వైద్యులను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు




**మందమర్రి మార్చి 12: (సామాజిక తెలంగాణ):**
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్,డాక్టర్ మానస పీజీ సీట్లు సాధించిన సందర్భంగా మందమర్రి బిఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉన్నత చదువుల నిమిత్తం బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందమర్రి ప్రజలకు వారు అందించిన వైద్య సేవలను గుర్తు చేశారు. పీజీ సీట్లు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు వైద్యులకు స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండి అబ్బాస్,బర్ల సదానందం, వేముల నర్సయ్య,సాగర్ బాబు, మజార్ సలవుద్దిన్, నోముల శ్రీధర్ గౌడ్,మధు, తదితరులు, పాల్గొన్నారు.

---

# పలు వివాహ శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**(సామాజిక తెలంగాణ న్యూస్)**
షాద్ నగర్ నియోజకవర్గంలో జరిగిన గృహప్రవేశ మరియు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ శుభకార్యాలలో మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి,సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులుపలువురు నాయకులు,గోపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డి రాజు,నర్సిమా,శ్రీకాంత్ గౌడ్, పాండు,దర్శన్,దినేష్, శివచారి,చందర్ అన్వారీరాజు, శ్రీను,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ వైభవాన్ని తిరగా రాస్తున్న 7వ వార్డు కౌన్సిలర్

**దండుగుల వెంకటమ్మ, బండల వెంకటస్వామి**



వనపర్తి జిల్లా ప్రతినిధి సామాజిక తెలంగాణ

కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో కౌన్సిలర్ దండుగుల వెంకటమ్మ బండల వెంకటస్వామి ప్రజల అభిప్రాయం మేరకు వార్డులో ఉన్న రచ్చకట్టను తన సొంత ఖర్చులతో నిర్మాణ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది. కౌన్సిలర్ దండుగుల వెంకటమ్మ బండల వెంకటస్వామి మాట్లాడుతూ వార్డులోని ప్రజలకు ఏ సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకువచ్చిన తక్షణమే స్పందించి వారి సమస్యను అధికారుల సమన్వయంతో ముందుకు వెళుతూ సమస్య పరిష్కారం చేసే దిశగా ముందుకు వెళతానని ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. కాలనీ వాసులు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రజల అభిప్రాయం మేరకు రచ్చకట్టను ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్చడం ఎంతో అభినందనీయము. ప్రజల కోసం ముందుండి పనిచేస్తూ, వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకత్వం నిజంగా ఆదర్శనియం అని ప్రజలు అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్ దండుగుల వెంకటమ్మ బండల వెంకటస్వామి మాట్లాడుతూ 7వ వార్డు ప్రజలు కూడా తమ పన్నులు సమయానికి చెల్లిస్తూ, కలిసి మెలిసి వార్డు అభివృద్ధికి సహకరిస్తున్నారు. ఇలాంటి మంచి పనులు కొనసాగాలని, 7వ వార్డు మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా వార్డు సభ్యులకు ప్రజలకు ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని సందర్భంగా అన్నారు.

# పేదింటి ఆడ బిడ్డ పెళ్లికి ఆర్థిక సహాయం



శాలిగౌరారం, మర్చి 12, (సామాజిక తెలంగాణ):- శాలిగౌరారం మండల పరిధిలోని బైరవునిబండ గ్రామానికి చెందిన పులిగిల్ల రాములు కుమార్తె శంకరమ్మ వివాహ ఖర్చుల నిమిత్తం జిల్లా కాంగ్రెస్ నాయకులు దండా అశోక్ రెడ్డి తన వంతుగా 5,000/-రూపాయల ఆర్థిక సాయాన్ని అందచేశారు. అశోక్ రెడ్డి పంపించిన ఆర్థిక సహాయాన్ని గ్రామ సర్పంచ్ నరిగే యాదయ్య నూతన వదువు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల శంకరయ్య, లక్ష్మణా చారి, గణేష్, శంకరయ్య, సర్వయ్య, జానయ్య, శ్యామ్, సతీష్, రాములు, వీరయ్య, అంజయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల మౌలిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



శాలిగౌరారం, మార్చి12, (సామాజిక తెలంగాణ):- గామాల మౌలిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు దండ అశోక్ రెడ్డి, భైరవుని బండ సర్పంచ్ నరిగె యాదయ్య అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా మండల పరిధిలోని భైరవునిబండ గ్రామం లో భువనగిరి ఎంపీ చామల, తుంగతుర్తి ఎమ్మెల్యే సామెల్ ల సహకారం తో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద మంజూరైన 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డును గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దండ శ్రీలత-కృష్ణా రెడ్డి, మాజీ సర్పంచ్ నరిగే శంభయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు పడాల శంకరయ్య, వార్డు మెంబర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టి జి పి ఎస్ సి ద్వారా వెంటనే సర్వేయర్ పోస్టులను భర్తీ చేయాలి

**లక్షల్లో అభ్యర్థుల ఎదురుచూపులు పుడమి ఫౌండేషన్ చైర్మన్ - వెంకటపతి రాజు**



మక్తల్ మార్చి 12 (సామాజిక తెలంగాణ) మక్తల్ పుడమి ఫౌండేషన్ చైర్మన్ వెంకటపతి రాజు మాట్లాడుతూ (టీజీపీఎస్సీ) ద్వారా వెంటనే సర్వేర్ పోస్టులను భర్తీ చేయాలని డిమండ్ చేస్తున్నాము (బీ టెక్) (ఎం టెక్) చేసి కూడా మేము లక్షలు పెట్టి కుటుంబం వదిలి చాలీ చాలని జీతంతో మేము చదివిన చదువుకు సంబంధం లేకుండా వేరే పనులు చేస్తున్నారు మన తెలంగాణలో ఇప్పటి వరకు గవర్నమెంట్ సర్వేయర్ల కొరతా చాలా ఉంది ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోన్ని మా సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నాము ప్రభుత్వం రాక ముందు ఎన్నో హామీలు ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న క్రమంలో సర్వే నోటిఫికేషన్ మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు కావున లక్షల్లో డబ్బులు వెచ్చించి సివిల్ సర్వేర్లుగా లక్షల్లో అభ్యర్థులు నిరుద్యోగులుగా మారిపోయారు గెలవక ముందు హామీలు ఇచ్చి గెలిచాక హామీలను మురికి కాలువలో తొక్కేస్తున్నారు బీ టెక్ ఎం టెక్ లు చేసి మేము ఆటోలు క్యాబ్ లు జొమాటోలో షాపింగ్ మాలో అడ్డ మీద లేబర్ పనులు కాల్ సెంటర్లో హోటల్లో కిరాణా షాప్ లో పెయింటింగ్ పనులు వ్యవసాయం చేస్తున్నం ప్రభుత్వం ఇప్పటికైనా మేము చదివిన చదువుకి (టి ఎస్ పి ఎస్ సి ) నోటిఫికేషన్ వేసి భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో భూత్పూర్ అశోక్ ఓబులేష్ కేశవ్ అశోక్ రాము క్రాంతి పరుశురాం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నమారు గ్రామపంచాయతీ పరిధిలో నూతన బోరు మోటర్లు ఏర్పాటు

**- చిన్నమారూర్ గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్**



వనపర్తి జిల్లా ప్రతినిధి సామాజిక తెలంగాణ

చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారూరు గ్రామపంచాయతీ పరిధిలో గతంలో వేసిన బోరు మోటర్లు చెడిపోవడంతో వాటి స్థానంలో నూతన బోరు మోటర్లు ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్. గ్రామ ప్రజల అవసరాల మేరకు బీసీ కాలనీలో ఉన్న దాసరి శ్రీనివాసులు కల్లం దొడ్డి దగ్గర ఉన్న బోరు గత కొన్ని రోజుల క్రితం చెడిపోవడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ మద్దూరి శంకర్ దృష్టికి తీసుకురావడంతో గ్రామ సర్పంచ్ తక్షణమే స్పందించి నూతన బోరు మోటర్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజల కోరిక మేరకు నీటి వసతిని ప్రజల అవసరాల మేరకు తక్షణమే కల్పించడం జరిగింది. గ్రామ సర్పంచ్ మద్దూర్ శంకర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి వచ్చిన వెంటనే అధికారుల సమన్వయంతో గ్రామ ప్రజల సహకారంతో అందరిని కలుపుగోలు చేసుకుని సమస్య పరిష్కారం అయ్యే దిశగా ముందుకు వెళతానని సందర్భంగా అన్నారు. కాలనీ ప్రజల కోరిక మేరకు తక్షణమే స్పందించి నూతన బోరు మోటర్ ఏర్పాటు చేసి నీళ్ల వసతి ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ కు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నిషేధిత అలివి వలలతో మత్స్య సంపదను కొల్లగొడుతున్న ఆంధ్ర దళారులు

**దళారుల సహాయముతో నిషేధిత అలివి వేట కొనసాగింపు**





వనపర్తి జిల్లా ప్రతినిధి సామాజిక తెలంగాణ

వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని కృష్ణానది నది పరివాహ ప్రాంతంలో గడ్డ బస్వాపూర్, బెక్కెం, గూడెం, పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్లటూరు, అయ్యవారిపల్లి, కాలూర్, చెల్లెపాడు, ఈ గ్రామాల శివారులోని పదుల సంఖ్యలో నిషేధిత అలివి వలల తో వేట కొనసాగిస్తున్న ఆంధ్ర జాలర్లు. చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న దళారులు ఆంధ్ర జాలర్లను తీసుకువచ్చి కమిషన్ల కొరకు నిషేధిత అలివి వలలతో చాపల వేట కొనసాగిస్తున్నారు. మత్స్య సంపదను నిషేధిత అలవి వలలతో పట్టపగలే చిన్న చేపల సైతం వేటాడి వేటాడి కొల్లగొడుతున్న ఆంధ్ర, తెలంగాణ, ఏజెంట్ స్మగ్లర్లు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడంలో భాగంగా నది పరివాహక ప్రాంతాల్లోనూ చెరువులలోనూ, కుంటలలోనూ, చేప పిల్లలను వదిలి వాటిని పెంపు చేసుకొని మత్స్యకారులను వారి జీవనోపాధిని మెరుగుపరిచే క్రమంలో మత్స్యశాఖను అభివృద్ధి వైపు పరుగులు పెట్టాలన్న నిర్ణయంతో కోట్లలాది రూపాయలతో చేప పిల్లలను కొనుగోలు చేసి నదులలో పెంచుతుంటే మత్స్యకారుల జీవితాలను బ్రతుకు తెరువును ఆగమయ్యే విధంగా కేజీ కన్నా పెద్ద చేపలు కాకుండా చిన్న, చిన్న, గుడ్డు చేప పిల్లలను సైతం నిషేధిత అలవి వలలతో పట్టి వేస్తు స్థానిక మత్స్యకారులు కడుపులో కొడుతున్న దళారులు వ్యాపారులు, స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికేతరులు కొంత మంది అధికార పార్టీ నాయకుల కను సన్నాళ్లలో స్థానిక మండల రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మరియు మత్స్య శాఖ అధికారులకు మత్స్య సంపద కొల్లబడుతున్న స్మగ్లర్లు ఇచ్చే ముడుపులకు ఆశపడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. అలవి వలలు నిషేధము ఉన్న స్థానిక అధికారులు పట్టపగలు అలవి వలలతో గుడ్డు చేపలను పట్టపగలే పట్టుకొని ఎండబెట్టి రాశులు పోస్తు వాహనాల ద్వారా ఇతర ప్రదేశాలకు తరలిస్తూ ఉన్న అధికారులు ఎందుకు చర్య తీసుకుంట లేరని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్స్యశాఖ అధికారులను, రెవెన్యూ అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని, స్థానికులు మత్స్యకారులు, మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదనతో ముక్త కంఠంతో విమర్శిస్తున్నారు.

# అమ్మాయి పల్లి గ్రామంలో నీళ్లు ఉన్న వాడుకోలేని పరిస్థితి

### తెల్లవారుజామున 4 గంటలకు నీళ్లు వదులుతున్న వాటర్ మెన్

### ఈ నీళ్లు ప్రజల అవసరాల కొరక లేక నూతనంగా నిర్మిస్తున్న ఇండ్ల కొరక

**వనపర్తి జిల్లా ప్రతినిధి సామాజిక తెలంగాణ**

చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ లో పనిచేసే వాటర్ మెన్ రాత్రి మూడు గంటలకు, మూడున్నర గంటలకు, నాలుగు గంటలకు, గేటు ఓపెన్ చేసి నీళ్లు వదలడం జరుగుతుంది. తెల్లవారుజామున అందరు నిద్రపోయే సమయంలో ఈ నీళ్లు వదలడం వల్ల ఈ నీళ్లు ఎవరికి ఉపయోగం లేకుండా వృధాగా పోవడం జరుగుతుంది. గతంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోవడం, చెప్పడం జరిగింది. అయినా గ్రామ వాటర్ మెన్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఆయనకు ఎప్పుడు ఇష్టం వస్తే అప్పుడు నీళ్లు వదలడం జరుగుతుంది. ఆ సమయంలో ఎవరు నీళ్ళు పట్టుకొని




ఉపయోగించుకునే వీలు కుదరదు ఎందుకంటే ఆ సమయంలో అందరూ నిద్రపోయి ఉంటారు. గ్రామంలో ప్రజలలో చర్చ నడుస్తూ ఉన్నది ఈ సమయానికి నీళ్లు వదిలేది ఎవరి కొరకు, గ్రామ ప్రజల అవసరాల కొరక లేక కొంత మంది నూతనంగా నిర్మిస్తున్న గృహాల అవసరాల కొరక అనే చర్చ గ్రామంలో నడుస్తున్నది. మండలంలో అన్ని గ్రామాలలో ఒక సమయం ఉదయం, సాయంత్రం ఒక నిర్ణయం ప్రకారం వాటర్ మెన్ లో నీళ్లు వదలడం జరుగుతు ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా అమ్మాయిపల్లి లో వాటర్ మెన్ కు ఇష్టం వచ్చినప్పుడు నీళ్లు వదలడం, ఇష్టం వచ్చినప్పుడు నీళ్లు బందు చేయడం, ఎవరైనా అడిగితే వాళ్ళని దూషించడం జరుగుతుంది. వాటర్ మెన్ ఇష్ట పూర్తిగా పని చేయడం జరుగుతుంది. ఈ విషయంపై మండల అధికారులు, ఎంపీడీవో, ఎంపీఓ, గ్రామ పంచాయతీ సెక్రెటరీ, మరియు గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో ప్రజలకు నీళ్లు అందించే విషయము ఆ నీళ్లను ప్రజలు సద్వినియోగం చేసుకుని విధంగా నీళ్లు ప్రజలకు వీధి వీధికి వదిలే సమయం కేటాయించగలరని అలాగే ఇలాంటి విషయాలు మళ్లీ పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము. గతంలో అనేకమార్లు చెప్పిన కూడా వాటర్ మెన్ పద్ధతి మార్చుకోలేదు, ఈ విషయాన్ని అనేకమార్లు మండల అధికారుల దృష్టికి తీసుకుపోవడం జరిగింది అధికారులు కూడా ఈ విషయంపై తగు జాగ్రత్తలు తీసుకోలేదు. ఎప్పుడైనా స్పందించి నీళ్లు ప్రజలకు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుచున్నాము.

# ఆన్ లైన్లో గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలి..

### జిల్లా అదనపు కలెక్టర్, రెవెన్యూ, శ్రీనివాస్ రావు..

**మంచిర్యాల మార్చి 12,(సామాజిక తెలంగాణ):**

వినియోగదారులు ఆన్ లైన్లో మాత్రమే గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు తెలిపారు.గురువారం జిల్లాలోని సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఎల్,పి,జి డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి గ్యాస్ కంపెనీల సేల్స్ అధికారులతో ఫోన్ ద్వారాసమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్



సిలిండర్ల కొరత లేదని,వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు, గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్ లైన్ లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ బుకింగ్ సమయం సింగిల్ సిలిండర్ వారికి 25 రోజులు,డబుల్ సిలిండర్ వారికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్ కు ఓ.టి.పి చెప్పి సహకరించాలని,హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్ లో సిలిండర్లను విక్రయించాలని చూస్తే నిత్యవసరల సరుకుల చట్టం 1955 క్రింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్పిజి వినియోగదారులు కె.వై.సి తప్పనిసరిగా చేసుకోవాలని,గ్యాస్ ఏజెన్సీ ల వద్ద,ఆన్ లైన్, గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్,యాప్ లో,గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.టి. సికి 10కోట్ల ఆదాయమే వస్తే.....

### ప్రస్తుత,రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు ఎందుకు చెల్లిస్తలేరు.

**సామాజిక తెలంగాణ వనపర్తి మండలం న్యూస్ ప్రతినిధి.**

ఎం.ఎల్.ఏ గారు మీ ఊకదంపుడు ఉపన్యాసాలు పేపర్ ప్రకటనలకే బాగుంటున్నాయి.రీప్లేస్మెంట్ లో కొత్త బస్సులు వేస్తే మీ ఘనత అని చెప్పుకోవడం సిగ్గుచేటు.మహాలక్ష్మి పథకంతో ఆర్.టి.సినీ దివాళా తీయించి ఘనత రేవంత్ రెడ్డిది. నందిమల్ల.అశోక్ జిల్లా మీడియా కన్వీనర్. బి.ఆర్.ఎస్ హయాములో ఆర్.టి.సి దివాళా తీసిందని మేఘారెడ్డి ఎం.ఎల్.ఏ అనడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనం అని జిల్లా బి.ఆర్.ఎస్ మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్ విమర్శించారు.నాలుగు కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేటు యాజమాన్యంలోనివి వాటిని తాము సాధించామని చెప్పడం సిగ్గుచేటు. ఎలక్ట్రిక్ బస్సులతో కార్మికులను తగ్గించి ఆర్.టి.సి సంస్థను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అశోక్ ఆరోపించారు. కె.సి.ఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్.టి.సి సంస్థను లాభాలభాటలో నడిపారని,కె.సి.ఆర్ ఉన్నపుడే కార్మికుల జీతాలు పెరిగాయని,ఆర్.టి.సి కార్మికులకు 64శాతం పి.ఆర్.సి ఇవ్వడం జరిగిందని,కె.సి.ఆర్ గారు ప్రభుత్వంలో ఆర్.టి.సినీ విలీన ప్రక్రియ దాదాపు పూర్తి చేయడం జరిగిందని అశోక్ అన్నారు రేవంత్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్.టి.సి సంస్థను



ప్రభుత్వంలో విలీన ఫైల్ మీద సంతకం పెడతానని చెప్పి రెండున్నర ఏండ్లు అయిన దిక్కులేదని అశోక్ ఎద్దేవా చేశారు. ఎం.ఎల్.ఏ గారు చెప్పినట్లు ఆర్.టి.సి లాభాల బాటలో ఉంటే కొత్త ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని అశోక్ ప్రశ్నించారు.కార్మికులకు పనిభారం పెరిగి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు జరిగాయని అశోక్ గుర్తు చేశార 2014 నుండి 2018వరకు ఎంత ఆదాయం ఆర్.టి.సి ఆర్జించిన విషయం రికార్డులలో ఉంటుందని వనపర్తి డిపోలో నెలకు సగటున 15లక్షల ఆదాయంతో కోట్ల రూపాయల లాభాలతో ఆర్.టి.సి నడిచిందని నందిమల్ల.అశోక్ అన్నారు. నిజంగా ఆర్.టి.సి డిపో 10కోట్ల రూపాయల లాభాలతో నడుస్తుంటే రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు రావలసిన బెనిఫిట్స్ మరియు ప్రస్తుత ఉద్యోగులకు పి.ఆర్.సి ఎందుకు ఇవ్వడం లేదని అశోక్ ప్రశ్నించారు. మహిళల భాగస్వామ్యం అనడం హాస్యాస్పదం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ముందడుగు వేయకపోగా ఇస్తామన్న ప్రతి మహిళకు 2500కూడా దిక్కులేదని అంతేకాకుండా ఆర్.టి.సి బస్సుల కొనుగోలులో మహిళల భాగస్వామ్యం అనడం హాస్యాస్పదం అని విమర్శించారు. ఆర్.టి.సి సంస్థను క్రమంగా ప్రైవేటు పరం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాయమాటలతో మభ్యపెట్టడానికి చేస్తున్న ప్రకటనలు మాత్రమేనని అశోక్ అన్నారు. ఈ సమావేశంలో యువత అధ్యక్షులు సూర్యవంశం.గిరి,నాయకులు ఎ. కే.పాషా,అలీమ్ ఉన్నారు.

# బెంగళూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం మానవత్వం చాటిన - మంత్రి వాకిటి శ్రీహరి









**మక్తల్ మార్చి 12 (సామాజిక తెలంగాణ)**

గురువారం ఉదయం బెంగళూరు జాతీయ రహదారిపై పాల్మకుల దగ్గర బైక్ యాక్సిడెంట్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే ధ్యేయంగా మరో మారు మానవత్వాన్ని చాటుకున్నారు మంత్రి వాకిటి శ్రీహరి అటుగా మక్తల్ పర్యటనకు వెళ్తున్న మంత్రి వాకిటి శ్రీహరి తన కాన్వాయ్ ని ఆపి రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలను తన సిబ్బంది తో కలిసి తాను స్వయంగా పక్కకు తీశారు చూడటానికి ఆ ఇద్దరు యువకుల మృతదేహాలు తలలు పగిలి భీతావహకర పరిస్థితి లో ఉన్నాయి అధికారిక పర్యటన కు వెళ్తున్న మంత్రి తన చేతికి రక్తపుమరకలు అంటుతున్నా వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా ఆ ఇద్దరి మృతదేహాలను పక్కకు జరిపారు అంబులెన్స్ ను పిలిపించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ప్రజా ప్రతినిధులు అంటే ఖద్దరు బట్టలు వేసుకొని కార్లల్లో తిరగడం కాదు ఆపదలో ఉన్నవారిని తక్షణమే ఆదుకోవడమని అందరికీ తెలిసేలా చేశారు మంత్రి వాకిటి శ్రీహరి సహాయక చర్యలు చేపట్టిన మంత్రి పై ప్రయాణికులు ప్రశంసల జల్లు కురిపించారు

# బహిరంగ హెచ్చరిక అధికారులారా మీరు రాజకీయ పార్టీలకు తొత్తులా లేక ప్రజల సేవకులా



తెలంగాణ ప్రభుత్వము
తహసిల్దార్ కార్యాలయం :: క్రిష్ణ మండలం

నెం.A /838 /2024

తేది:28-12-2024

నోటీసు

విషయము : అసైన మెంట్ చట్టం –నారాయణపేట్ జిల్లా -క్రిష్ణ మండలం-ముడుమాల్ దొడ్డి గ్రామము సర్వే నెంబర్. 68 విస్తీర్ణం (36.34) గుంటల ప్రభుత్వ భూమి అసైన్ మెంట్ కమిటి ద్వార సంక్రమించిన ధృవపత్రములు సమర్పించుట కొరకు నోటీస జారిచేయుట-గురించి విచారణ.

నిర్దేశము : 1. అర్జిదారు శ్రీ.వాకిటి అంజనేయులు ముదిరాజ్ గ్రామము మక్తల్ గారి అర్జి తేది.20.12.24.

@@@

పై నిర్దేశము పురస్కరించుకొని ముడుమాల్ దొడ్డి గ్రామ శివారులో గల సర్వే నెంబర్. 68 విస్తీర్ణం (36.34) గుంటల ప్రభుత్వ భూమి అసైన్ మెంట్ కమిటి ద్వార సంక్రమించిన ధృవపత్రములు సమర్పించుటకు నోటీస జారిచేయుట గురించి.

ఇట్టి విషయముపై తెలియచేయడము ఏమనగా ఈ క్రింద తెలిపిన పట్టాదార్లు వారికి ఇట్టి ప్రభుత్వభూమి ఏవిదంగా సంక్రమించినది అట్టి ధృవపత్రములు సమర్పించగలరు.

| వరుస సంఖ్య | ఖాతా నెంబరు | పట్టాదారు పేరు (తండ్రి/భర్త పేరు) | సర్వే నెం | విస్తీర్ణం(ఎ. గుం.) |
|---|---|---|---|---|
| 1 | 18 | బి. చంద్రా జ్యోతి (నర్సింహులు) | 68/7 | 2.20 |
| 2 | 19 | చైతన్య (నర్సింహులు) | 68/8 | 2.20 |
| 3 | 28 | జె. సంతోషమ్మ (శ్రీనివాసులు) | 68/18 | 2.20 |
| 4 | 59 | బాసిద ఖాన్ ఉమర్ (ఉమర్ అలి) | 68/3 | 2.20 |
| 5 | 92 | జె. లావణ్య (రఘువీర) | 68/6 | 2.20 |
| 6 | 110 | సాలం బిన్ ఉమర్ (ఉమర్ అలి) | 68/2 | 2.20 |
| 7 | 111 | సుభా సుల్తాన (సాలం బిన్ ఉమర్) | 68/4 | 2.20 |
| 8 | 149 | జుట్ల చిన్న హన్మంతు (హన్మన్న) | 68/10 | 2.20 |
| 9 | 150 | జుట్ల శ్యామల (చిన్న హన్మంతు) | 68/11 | 2.20 |
| 10 | 151 | ఆనంపల్లి హన్మంతు (రాములు) | 68/12 | 2.20 |
| 11 | 152 | ఆనంపల్లి జయశ్రీ (హన్మంతు) | 68/13 | 2.20 |
| 12 | 153 | అమ్మక్క (నర్సప్ప) | 68/14 | 2.20 |
| 13 | 154 | పద్మమ్మ (సి శేకర్) | 68/15 | 2.20 |
| 14 | 156 | P.శ్యామలమ్మ (రాజు) | 68/17 | 2.20 |
| 15 | 60003 | వెంకటమ్మ (సురులింగప్ప) | 68/16/1 | 1.34 |

ఈ నోటీస్ వేలుపడిన నాటి నుండి (3) రోజులలో వ్రాత పూర్వకముగా తెలియపర్చగలరు. లేని ఎడల అసైన్ మెంట్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు చేపట్టబడును.

దీని ప్రతి సంబంధిత పట్టేదారులకు (మండల గిర్దావర్, క్రిష్ణ గారి ద్వార పట్టేదారులకు తామీలు చేసి, తామిలు కాపిని కార్యాలయములో సమర్పించగలరు.)

తహశిల్దార్ 28/12/2024
క్రిష్ణ మండలం



**మక్తల్ మార్చి 12 (సామాజిక తెలంగాణ)**

మక్తల్ నియోజకవర్గం కృష్ణ మండల రెవెన్యూ యంత్రాంగం తీరుపై జ్యోతి రావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు వాకిటి అంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ముడుమాల్ దొడ్డి గ్రామంలోని సర్వే నంబర్ 68 భూమి వ్యవహారంలో అధికారులు చట్టాన్ని గాలికొదిలేసి రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు (ఆర్టిఐ ) చట్టం ప్రకారం 30 రోజుల్లో ఇవ్వాల్సిన సమాచారాన్ని, 80 రోజులు గడిచినా ఇవ్వకపోవడం అధికారుల అసమర్థతకు పరాకాష్ట ఈ భూమి విషయంలో బీఆర్ఎస్ బీజేపీ కాంగ్రెస్ పార్టీల నాయకులు అధికారులను మేనేజ్ చేస్తున్న మాట వాస్తవం కాదా వారి ఒత్తిడి వల్లే సమాచారాన్ని తొక్కిపెడుతున్నారా విచారణలో అంతా సక్రమంగా ఉంటే రిపోర్టును బయటపెట్టడానికి భయమెందుకు మీరు దాస్తున్న ఆ రహస్యం ఎవరిని కాపాడటానికి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదు వెంటనే సమాచారం ఇవ్వకుంటే నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం అధికారులు చట్టానికి లోబడి పనిచేయాలి కానీ జెండాలు మోసే నాయకులకు కాదు బాధ్యతాయుతమైన సీటులో కూర్చుని అక్రమాలకు సహకరిస్తే మిమ్మల్ని కోర్టు బోనులో నిలబెట్టడం ఖాయం అన్నారు

## కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం






**సామాజిక తెలంగాణ పత్రిక జమ్మికుంట ప్రతినిధి: మార్చ్ 12**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ కలెక్టర్ ఆడిటోరియంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మున్సిపల్ పరిపాలన, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, అభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాలపై అధికారులు మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ ఎండి ఆయాజ్, వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, గౌరవ కౌన్సిలర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమం ద్వారా మున్సిపల్ పాలనలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల వేగవంతమైన అమలుకు అవసరమైన సూచనలు అందించినట్లు అధికారులు తెలిపారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన సర్పంచ్ గాయత్రీ దేవి





**మహమ్మదాబాద్ మార్చ్ 12(సామాజిక తెలంగాణ)**
మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ గాయత్రీ దేవి ముస్లిం సోదరుల కోసం బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఆమె నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఉపవాస విరమణ చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మత సామరస్యానికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ముస్లిం సోదరులు అభినందించారు. తమపై చూపిన ఆదరణకు గ్రామ సర్పంచ్ గాయత్రీ దేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు మాజీ కోఆప్షన్ మెంబర్ (మజీద్ కమిటీ సభ్యులు) ఈసాబ్రావి, ఖాజా, అబ్దుల్ బ్రావి, యూసుఫ్, రఫీ, ఎంఎ. సర్దార్ , రసూల్ ,బిఆర్ఎస్ యువ నాయకుడు ఎస్ వరుణ్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ జీ సుమిత్రా లక్ష్మణ్ వార్డ్ మెంబర్స్ చిన్నారెడ్డి, మాధవులు, శ్రీరామ్, జోగు శ్రీనివాస్, బిఆర్ఎస్ గ్రామ నాయకులు మోహన్ రెడ్డి, సాయి రెడ్డి, తిరుమలరెడ్డి, బి.రాజ్ కుమార్, జే.రామ్మోహన్ జీ, ఈ. రాజు గౌడ్, బి. శ్రీను, ఎన్. కన్న, తదితరులు పాల్గొన్నారు

## సిసి రోడ్డు పనులను పరిశీలించిన

### సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి



**సామాజిక తెలంగాణ దోమ మండలం మార్చి12**
దోమ మండల అనుబంధ గ్రామమైన ఉదన్‌రావు పల్లికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సహకారంతో సీసీ రోడ్డు మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా సిసి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ జా వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు శివ, అంజిలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 17వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమం - - చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్‌కు ఘన స్వాగతం

**సామాజిక తెలంగాణ పత్రిక జమ్మికుంట ప్రతినిధి , మార్చి 12:**
జమ్మికుంట మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 17వ వార్డులో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, కౌన్సిలర్లు బత్తుల లక్ష్మయ్య, గుర్రం కావ్య పరశురాం, కుతాడి తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 17వ వార్డు ప్రజలు, స్థానిక అడ్వకేట్ దూడపాక శ్రీనివాస్ వారిని వార్డులోకి ఆహ్వానించి శాలువాతో ఘనంగా సత్కరించారు. అంబేద్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా



అందజేశారు. అలాగే చైర్మన్ హోదాలో మొదటిసారి వార్డు సమస్యలను తెలుసుకోవడానికి వచ్చిన మొలుగు ప్రశాంత్ కుమార్‌కు దూడపాక శ్రీనివాస్ తన ఎంబ్రాయిడరీతో తయారు చేసిన ఫోటో ఫ్రేమ్‌ను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా దూడపాక శ్రీనివాస్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా చివరి వ్యక్తి వరకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. అలాగే వార్డులో ప్రధాన సమస్యలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణం మరియు ఇతర అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి చైర్మన్ మరియు ప్రజా ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్‌పీలు శ్రీదేవి, బాను, శిరీష, సరిత, సిఎల్ఆర్‌పీ జ్యోతి, ఆశ వర్కర్ సుజాత, అధికారులు మహేష్, కిరణ్, ఇతర సిబ్బంది మరియు వార్డు ప్రజలు మాలిక్ పాషా, శంకర్, స్వరూప, షమీమ్, సరోజన, రాజిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కార్పొరేషన్ ను ఏర్పాటు చేయండి

### -వనపర్తి జిల్లా వడ్డెర నాయకులు.

**పెబ్బేరు, మార్చి 12 (సమస్య తెలంగాణ) :**
వెనుకబడిన తరగతుల జాబితాలో ఉన్న వడ్డెర కులస్తులకు ప్రత్యేకంగా వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వనపర్తి జిల్లా వడ్డెర నాయకులు గురువారం వనపర్తి శాసన సభ్యుడు తూడి మేఘారెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు దేవరాజు అధ్యక్షతన గురువారం వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వడ్డెర కుల అభివృద్ధికి వెయ్యి కోట్ల నిధులు కేటాయించి, వడ్డెర కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్ల తో వనపర్తి జిల్లా వడ్డెర నాయకులు వినతి పత్రం అందించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెరకుల అభ్యున్నతి కోసం కులాన్ని బీసీ జాబితా నుండి తొలగించి ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జడ్చర్ల లో వడ్డెర సంఘ బహిరంగ సభ వేదికగా ప్రకటించారని వారు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీ హయాంలో వడ్డెర కులాన్ని ఎస్టీల్లో చేర్చాలని కేంద్రానికి లేఖ రాశారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడుస్తున్న వడ్డెర కుల అభ్యున్నతి గురించి ఎక్కడ మాట్లాడినా దాఖలు లేవని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రేపు జరగబోయే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో వడ్డెర ల గూర్చి ప్రస్తావించి, 1000 కోట్ల నిధులతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని యెడల అసెంబ్లీ ముట్టడి చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్షుడు రాజు, మండల ఉపాధ్యక్షులు రామకృష్ణ, వనపర్తి మండల అధ్యక్షుడు రాజు, నాయకులు నరసింహ, కురుమూర్తి, ప్రభాకర్, డి కురుమూర్తి లతోపాటు వివిధ మండలాల వడ్డెర నాయకులు పాల్గొన్నారు.

## మ్యాథ్స్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్పీఆర్ స్కూల్ విద్యార్థిని శివాన్షిక..






**మార్చి 12(సామాజిక తెలంగాణా )**
జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ వారు ఇటీవల హైదరాబాదులో సెకండ్ లెవెల్ లో నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో దామచర్ల మండల కేంద్రంలోని స్థానిక ఎస్ పి ఆర్ స్కూలుకు చెందిన మూడవ తరగతి విద్యార్థిని సోమ శివాన్షిక తండ్రి బిక్షం రెడ్డి జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందుకుగాను నిన్న హైదరాబాదులోని భారతీయ విద్యా భవన్ లో ఐబిఆర్ ఫౌండర్ రామకృష్ణ, మిస్ ఇండియన్ సుహాసిని, చైల్డ్ సైకాలజిస్ట్ సిరి పూజ,నేషనల్ రైఫిల్స్ షూటర్ డాక్టర్ భువనేశ్వరి గార్ల చేతుల మీదుగా ప్రశంస పత్రము మరియు మెమొంటో అందించారు. అనంతరం విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఎస్పీఆర్ పాఠశాల యాజమాన్యం ను ఉత్తమ టీచర్ అవార్డుతో డైరెక్టర్ కంభంపాటి శ్రీనయ్యను నిర్వాహకులు సన్మానించారు. ఇట్టి విజయాని సాధించిన శివాన్షిక ను పాఠశాల డైరెక్టర్లు జొన్నలగడ్డ శ్రీనివాస్ రెడ్డి, నాదెండ్ల అయ్యన్న కంబంపాటి శ్రీనయ్య,ప్రిన్సిపల్ స్వయంపాకల హరిత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సునీత,షాయిని శ్రీలక్ష్మి,వనజ, అంజలి, దేవిడ్,సోనీ తేజశ్రీ, రమ్యలత, జానీ బేగం తల్లిదండ్రులు మరియు విద్యార్థిని విద్యార్థులు అభినందించారు

## మతసామరస్యానికి ప్రతీక పవిత్ర రంజాన్ మాసం


### - టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య ఆధ్వర్యంలో మసీద్-ఏ-మహమ్మదీయలో ఇఫ్తార్ విందు



**సూర్యాపేట, మార్చ్12, (సామాజిక తెలంగాణ )**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు భాషా నాయక్ తండ, అంజనాపురి కాలనీలోని మసీద్-ఏ-మహమ్మదీయలో ముస్లిం సోదరులకు టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పాల్వాయి జానయ్య ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్వాయి జానయ్య మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీక అని తెలిపారు. ముస్లింలు రంజాన్ నెలలో భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉండి అల్లాహ్‌కు ప్రార్థనలు చేసి ప్రపంచ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారని అన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్న తారతమ్యాలు లేకుండా అందరూ ఐక్యంగా, సౌహార్దంతో పండుగలను జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గుడపూరి ప్రభాకర్, జిల్లా సంయుక్త కార్యదర్శి నజీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్పర్సన్ ను సన్మానించిన బీసీ జేఏసీ నాయకులు : బంటు వెంకటేశ్వర్లు

**ఈ రోజు 45.వ వార్డ్ షాబునగర్ లో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక**



మున్సిపల్ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలు గారిని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కుటుంబం మరియు వార్డ్ సభ్యులతో కలిసి శాలువాతో చిరు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 45వ వార్డ్ కౌన్సిలర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, సామాజిక వేత్త పోలాయాదయ్య, ఆవుదారపు మురళిముదిరాజ్, ఉబ్బపల్లి కాశయ్య, , బంటు విజయలక్ష్మి -వెంకటేశ్వర్లు ముదిరాజ్, నక్క పద్మ, ఖాజా,పోలా హైమావతి,దోనేటి అశోక్,కోలా రాంబాబు ముదిరాజ్, బంటు హన్మంత్,బంటు మేఘన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ప్రసంగిస్తూ ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక లో ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు

# ఎస్ఎఫ్ఐ మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల విద్యార్థినిల ప్రతిభ.

**మొదటి ర్యాంకు చందావత్ రేవతి --**
**ద్వితీయ ర్యాంకు బి చందన --**
**తృతీయ ర్యాంకు ఇస్లావత్ సింధు.**



**మహబూబాబాద్ కురవి మార్చి 12 సామాజిక తెలంగాణ):**
ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి పదవ తరగతి టాలెంట్ టెస్ట్‌లో కురవి మండలంలోని కేజీబీవీ మరియు ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఈ పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను మరోసారి నిరూపించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో చందావత్ రేవతి మొదటి ర్యాంకు సాధించగా, బి చందన ద్వితీయ ర్యాంకు, ఇస్లావత్ సింధు తృతీయ ర్యాంకు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. విజేతలను ఎస్ఎఫ్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతిబసు, కురవి మండల కార్యదర్శి కొలిపాక వీరేందర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కృషితో ఉన్నత విజయాలు సాధించగలరని ఈ టాలెంట్ టెస్ట్ మరోసారి నిరూపించిందన్నారు. కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థినులు చూపిన ప్రతిభ ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే ఎల్లుండి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో కురవి మండల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కొరవి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో మంచి ఫలితాలు సాధించడం మాకెంతో గర్వకారణమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివితే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తులో మంచి విజయాలు సాధిస్తారని చెప్పారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో కూడా మా పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ మండల, జిల్లా నాయకత్వం అభినందనలు తెలియజేసింది.

# "పది" పరీక్షలకు సర్వం సిద్ధం..

**విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి..**
**జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి..**
**కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్..**



**మెదక్, సామాజిక తెలంగాణ, మార్చి:12**
జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఈ నెల మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జిల్లాలో పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. జిల్లాలో మొత్తం 68 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, 11,247 రెగ్యులర్ మరియు 100 ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30/12.50 వరకు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరీక్ష రోజున ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. ప్రతి రోజు పరీక్షా కేంద్రానికి కనీసం అరగంట ముందే చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులకు హాల్ టికెట్ చూపించి ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్ పొందలేని వారు ష్ఝ.ఎంవ్.వశ్రీఖఅస్త్రుఖు.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్లు, పెన్సిల్స్ మాత్రమే తీసుకురావాలని, సెల్ ఫోన్లు, క్యాలక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి ఉండదని తెలిపారు. హాల్ టికెట్ లేదా నావీ= షీట్‌లో ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే ఇన్విజిలేటర్ లేదా చీఫ్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో 163 దీఝూ సెక్షన్ అమల్లో ఉంటుందని, జన సమూహాలు గుమికూడరాదని తెలిపారు. పరీక్షల రోజుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ (ఫోన్: 9848214166) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది అందరూ నిబంధనలు పాటిస్తూ పరీక్షల నిర్వహణకు సహకరించాలని కోరారు.

# భద్రాద్రి సీతారాముల స్వామి వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు తయారుచేసి సమర్పించడం అభినందనీయం ఎమ్మెల్యే తలసాని



**మార్చ్ 12 అమీర్పేట్ (సామాజిక తెలంగాణ)**
భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా స్వామి వారికి మగ్గంపై పోచంపల్లి పట్టు వస్త్రాలు తయారు చేసి సమర్పించడం అభినందనీయమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ నెల 27 వ తేదీన భద్రాచలం లో జరిగే సీతారాముల కళ్యాణం, 28 వ తేదీన నిర్వహించే పట్టాభిషేకం సందర్భంగా అలంకరించే పోచంపల్లి పట్టువస్త్రాల తయారీకి ఉపయోగించే పట్టు ధారాలు (పోగులు)ను అమీర్ పేట లోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజల అనంతరం మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా మగ్గంపై వస్త్రాలు తయారు చేసే అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులకు అందజేశారు. ఈ పోగులతో భద్రాచలం రాముల వారి ఆలయం ప్రాంగణంలో వస్త్రాలను ఈ నెల 13 వ తేదీ నుండి తయారు చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. కార్యక్రమంలో ఆలయ జూా అంబుజ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, కమిటీ చైర్మన్ జయరాజ్, కార్యదర్శి రాజేశ్వరరావు, పద్మశాలి సంఘం నాయకులు భద్రయ్య, శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, వనం శ్రీనివాస్, కూతురు నర్సింహ, గుడిగే శ్రీనివాస్ యాదవ్, కట్టా బలరాం, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో ప్రతి వార్డుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

**భీమారం సర్పంచ్ ఉష్కమల్ల విజయలక్ష్మి పున్నం చందు.**



**సామాజిక తెలంగాణ, మంచిర్యాల జిల్లా, భీమారం మండలం, మార్చి 12.**
భీమారం, ప్రొఫెసర్ జయశంకర్ సార్ కాలని లో నిత్యం రద్దీగా ఉండే వీధిలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న విద్యుత్ సౌకర్యం చివరికి అందుబాటులోకి వచ్చింది. స్థానిక పాలకవర్గం మరియు విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఈ కాలనీలో విద్యుత్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. సరైన మౌలిక సదుపాయాలు లేక కాలనీవాసులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. భీమారం సర్పంచ్ ఉష్కమల్ల విజయలక్ష్మి, పున్నం చందు నాయకత్వంలో, విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ చర్యతో కాలనీవాసులు తమ దీర్ఘకాలిక సమస్య తీరిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధి కాలనీ ప్రజల జీవన నాణ్యతను పెంచడమే కాకుండా, భద్రతాపరమైన అంశాలలో కూడా మెరుగుదల తీసుకువస్తుందని భావిస్తున్నారు. స్థానిక ప్రభుత్వం మరియు అధికారులు చేపట్టిన ఈ చొరవ ప్రశంసనీయం. అని స్థానికులు అభినందించారు.

## జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ సాధారణ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)






**సామాజిక తెలంగాణ పత్రిక జమ్మికుంట ప్రతినిధి 12 మార్చ్**
తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్ గా పేరుగాంచిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ లో మొదటి సారిగా జరిగే సాధారణ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ని ఘనంగా సన్మానించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) మాట్లాడుతూ జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు తెలంగాణ రాష్ట్రంలోనే ఎంతో మంచి పేరు ఉంది కాబట్టి మన కమిటీ కూడా అదేవిధంగా ఉండి రైతులకు అన్నివిధాలుగా అందుబాటులో ఉండి రైతులకు అండగా ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గౌరవ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వదూవరులను ఆశీర్వదించిన

**మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ కె. రాజిరెడ్డి**



**సామాజిక తెలంగాణ దోమ మండలం మార్చి12**
దోమ మండలం తిమ్మాయిపల్లి రోడ్ లోని ఎస్ జీ గార్డెన్ లో దోమ మండలం బాస్పల్లి గ్రామానికి చెందిన రమాకాంత్ అనితల వివాహానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, దోమ మండల మాజీ సర్పంచుల నేత కె.రాజిరెడ్డి బొంపల్లి మాజీ ఎంపీటీసీ రాములు లతో కలిసి నూతన వదు వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొలం కొనిస్తామని చెప్పి లక్ష రూపాయలు తీసుకొని మోసం చేసిన మధ్యవర్తులు

**జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేసిన బాధితులు ఏం నాగరాజు**



**సామాజిక తెలంగాణ పత్రిక మార్చి 12:**
జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం నౌరోజి క్యాంపుకు చెందిన ఎం నాగరాజు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం ఆయన మాట్లాడుతూ అయిజ మండల పరిధిలోని నౌరోజీ క్యాంపుకి చెందిన వ్యక్తి నాగరాజు దగ్గర అదే గ్రామానికి చెందిన బోయ జొల్లు ఈరన్న, బోయ జొల్లు ఆంజనేయులు, బోయ జొల్లు నరసింహులు బోయ జొళ్ళు మధులు మా ఇంటి సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 93/3లో 35 గుంటల వ్యవసాయ భూమి విక్రయానికి ఉందని చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సత్యరెడ్డి చెప్పాడు పొలం యజమాని పరిమళ భర్త వెంకటరమణ తో మాట్లాడి 35 గుంటలు 15 లక్షలకు విక్రయించుటకు ఉంచారని తెలిపారు అందులో అడ్వాన్సు లక్ష రూపాయలు ఇవ్వాలని మిగతా నాలుగు లక్షలు ఒక నెలలో చెల్లించాలి ఆ తర్వాత ఆరు నెలలకు 10 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు దాంతో ఆయన ఆ నలుగురిని నమ్మి 23 -4 - 2025 మధ్యాహ్నం రెండు గంటలకు సమయంలో లక్ష రూపాయలు అడ్వాన్స్ గా ఇచ్చాడు. ఒక నెల తర్వాత 4 లక్షలు ఇస్తాను అంటూ వారి దగ్గరకు వెళ

# మంచిర్యాల జిల్లాలో క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు



**సామాజిక తెలంగాణ, మంచిర్యాల, మార్చి 12**
మై భారత్ ( మేరా, యువ, భారత్,) మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ క్రీడా పోటీలు ఈరోజుతో పాటు రేపు కూడా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. నరేందర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడల నిర్వహణను స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ డా. ఆర్. గోపాల్ కృష్ణ సమన్వయం చేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది క్రీడా పోటీల నిర్వహణలో సహకరించారు.
విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## నిమ్మగూడెంలో200 మీటర్ల సిసి రోడ్డు ప్రారంభించిన సర్పంచ్ జాడి రాజేష్




**సామాజిక తెలంగాణ.మహాముత్తారం, మార్చి 12:**
మహా ముత్తారం మండలంలోని అమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా గ్రామంలో సి సి 200 మీటర్ల రోడ్డును సర్పంచ్ జాడి రాజేష్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. నిమ్మగూడెం గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బికోజీ, వార్డు నెంబర్ లు సభావా త్ రాజారాం, పిల్లి రాజయ్య, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, కండెల వినయ్, గౌరవేణి రఘుపాల్ ,పవన్, వెలగొండ మహేష్, జనగామ సాయికుమార్ గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# చర్చిలకు నిధులు మంజూరు పట్ల హర్షం

**ఐటీ మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపిన రివైవు చర్చి పాస్టర్ సురేష్**



**సామాజిక తెలంగాణ మహాముత్తారం, మార్చి 12:**
కాటారం మండల కేంద్రములోని రివైవ్ చర్చి అభివృద్ధి కొరకు 20 లక్షల రూపాయలు నిధులను మంజూరు చేసిన ఐటి మంత్రి శ్రీధర్ బాబుకు రివైవ్ చర్చి పాస్టర్ సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సరియిన వసతులు లేక ఇబ్బంది పడుతూ పలు మారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు ఈ సారి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.దీనిని జీర్ణయించుకోలేని కాటారం సబ్ డివిజన్ కమిటీ పెద్దలు తనపై లేనిపోని ఆరోపణలు చేసి నిధులను అడ్డగించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.గత 15 సంవత్సరాల క్రితం కూడా మంథనిడివిజన్లో కోటి యాభై లక్షల నిధులు శ్రీధర్ బాబు మంత్రిగా ఉన్నప్పుడు మంజూరు చేయడం జరిగినది .అప్పుడు పొందుకున్న వారు మరల ఇప్పుడు ఉన్న కమిటీతో సహకరించి ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇందులో కూడా రాజకీయాలు చేయడం భాధకరమన్నారు.అవసరత ఉన్నవారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం ఖచ్చితంగా సహాయం చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు సహకరించాలి...డీసీపీ

**డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు: రామ్ రెడ్డి**

**అంతర్గాంలో పిల్లల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు**



**సామాజిక తెలంగాణ/గోదావరిఖని: మార్చి12**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధి అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, అంతర్గాం మండల కేంద్రంలో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకటస్వామి ఆధ్యక్షతన పిల్లల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, ఎస్.పి. నాయక్ బంజారా (ప్రవచనకర్త) హాజరై మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని తెలిపారు. యువత చెడు స్నేహాలు, ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒకసారి డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని చెప్పారు. డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీపీ తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఐ రామగుండం సంతోష్ రెడ్డి, అంతర్గాం మండల సర్పంచులు, దాదాపు 300 మంది స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన స్కానింగ్ కేంద్రాల ప్రారంభం

**సామాజిక తెలంగాణ/కోరుట్ల మార్చి 12:**
మెట్‌పల్లి పట్టణంలోని ప్ర భుత్వ ఆసుపత్రిలో నూత నంగా ఏర్పాటు చేసిన స్కా నింగ్ కేంద్రాలను కోరుట్ల ని యోజకవర్గ శాసనసభ్యుడు కల్వకుంట్ల సంజయ్ ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో మహిళల ఆరో గ్య రక్షణ కోసం అందుబా టులోకి తీసుకొచ్చిన హెచ్‌పీ వీ టీకా కార్యక్రమాన్ని కూడా ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా శాసనసభ్య డు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక వై ద్య సదుపాయాలను పెంచ డం ద్వారా ప్రజలకు మెరుగై న వైద్య సేవలు అందించవ చ్చని తెలిపారు. ప్రజల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ వైద్యశాలల్లోనే అ త్యాధునిక సదుపాయాల ను అందుబాటులోకి తీసు కురావాలని ప్రభుత్వ లక్ష్య మని



పేర్కొన్నారు.కొత్తగా ప్రారంభించిన స్కానింగ్ కేం ద్రం ద్వారా గర్భిణీ స్త్రీలు, మ హిళలు, ఇతర రోగులు ఇక పై ప్రైవేట్ ఆసుపత్రులకు వె ళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అవసరమైన ప రీక్షలు చేయించుకునే అవ కాశం కలుగుతుందని అ న్నారు. దీనివల్ల ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆ దా అవుతాయని తెలిపా రు.అలాగే హెచ్‌పీవీ టీకా మహిళల ఆరోగ్య రక్షణలో ఎంతో కీలకమని ఆయన వి వరించారు. ఈ టీకా తీసుకో వడం ద్వారా మహిళల్లో వ చ్చే గర్భాశయ క్యాన్సర్ వం టి ప్రమాదకర వ్యాధులను ముందుగానే నివారించవ చ్చని చెప్పారు. ముఖ్యంగా యువతులు, మహిళలు ఈ టీకా గురించి అవగాహన పెంచుకుని తప్పనిసరిగా తీ సుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ చై ర్మన్, వైస్ చైర్మన్ లను ఎ మ్మెల్యే సంజయ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో మెట్ పల్లి మున్సి పల్ చైర్మన్ మైలారపు లిం బాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి న వీన్ కుమార్, మున్సిపల్ కౌ న్సిలర్ నరేష్, ప్రవీణ్, వై ద్యులు, వైద్య సిబ్బంది, స్థా నిక ప్రజాప్రతినిధులు, పలు వురు ప్రజలు పాల్గొన్నారు.

# కేయూ యూనివర్సిటీలో ఘనంగా ఇఫ్తార్ విందు

**సామాజిక తెలంగాణ, హనుమకొండ**
కే.యూ లో ఇఫ్తార్ విందు మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆధ్వర్యంలో డాక్టర్ ఆసిమ్ ఇక్బాల్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది, ముఖ్యఅతిథిగా ఉపకులపతి ఆచార్య ప్రతాపరెడ్డి , రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ తో, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్ మాట్లాడుతూ
ఉపవాస దీక్షతో ఉదయాన్నే మొదలైన రోజు,
మనసును పవిత్రం చేసే పవిత్ర ప్రయాణం.
భక్తి గాలిలో పరిమళంగా విరజిమ్ముతూ,
అల్లాహ్ దయను మనసారా కోరే సమయం.
సాయంత్రపు సూర్యాస్తమయపు కాంతిలో
నెలవంక నవ్వు ముసురుకునే వేళ,
ఒక ఖర్జూరం తీపిలో
భక్తి రుచి మనసునిండా పరచుకుంటుంది.



ఇఫ్తార్ అనేది కేవలం ఆహారం కాదు,
మనసులు కలిపే మహా పండుగ.
పక్కవాడి ఆకలి తీర్చే కరుణ,
సోదరభావం పంచే పవిత్ర సంస్కృతి.
ఒకే తట్టలో భోజనం పంచుకుంటే
హృదయాలు దగ్గరవుతాయి,
మతాలు వేరైనా
మనుష్యత ఒక్కటేనని గుర్తు చేస్తుంది.
దయా ధర్మాల దీపం వెలిగించే
ఈ రంజాన్ సందేశం ---
మనిషి మనిషికి అండగా ఉండాలి,
ప్రేమే ప్రపంచానికి నిజమైన ప్రార్థన.
ఉపవాసం మనకు నేర్పింది
అణుకువను, సహనాన్ని, దయను.
ఇఫ్తార్ మనకు చెబుతుంది
పంచుకుంటేనే ఆనందం పరిపూర్ణం అవుతుందని.
అందుకే ఈ పవిత్ర వేళలో
మనమంతా ఒక కుటుంబం,
ప్రేమతో పలుకుదాం ---
రంజాన్ ముబారక్! తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో మైనార్టీ ప్రొఫెసర్, నాన్ టీచింగ్ కి సిబ్బంది మైనార్టీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మన కల్పవల్లి.....

**సింగరేణిని రాజకీయాల తో బలి చేయొద్దు**

**- కంపెనీ భవిష్యత్తుతో ఆటలాడకండి**


**మొలుమూరి శ్రీనివాస్**

**జిల్లా బీజేపీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు**



**సామాజిక తెలంగాణ/రామగిరి మండలం**
తెలంగాణ రాష్ట్రానికి ఆర్థికంగా ఎంతో కీలకమైన సింగరేణి కంపెనీను కొందరు రాజకీయ నాయకులు మరియు అధికారులు రాజకీయ వేదికగా మార్చడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం కొంతమంది అధికారుల వ్యవహార శైలి చూస్తే జీఎం కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాలుగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల్లా మారుతున్నాయనే భావన కలుగుతోంది.
కొంతమంది అధికారులు ప్రజా ప్రతినిధులకు సేవ చేయాల్సిన స్థితిలో కాకుండా పాలేరుల్లా పనిచేస్తూ కంపెనీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే సింగరేణి కంపెనీ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది.సింగరేణి కంపెనీపై ఆధారపడి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42,000 మంది కార్మికులు మరియు వారి కుటుంబాలు జీవిస్తున్నారు. ఈ కంపెనీ బలహీనపడితే వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి సింగరేణిని రాజకీయాల బలి చేయకుండా కంపెనీ అభివృద్ధి మరియు కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.సింగరేణి సంస్థను రాజకీయ జోక్యాల నుండి దూరంగా ఉంచి పారదర్శకంగా నడిపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేదంటే కార్మికులు మరియు ప్రజలు ఈ పరిస్థితిపై తీవ్రంగా స్పందించాల్సిన పరిస్థితి వస్తుంది.

# హాల్‌టికెట్‌పై కుక్క ఫోటో. షాక్‌కు గురైన అభ్యర్థి




**న్యూఢిల్లీ మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
బీహార్‌లో షాకింగ్ ఘటన జరిగింది. జిల్లా కోర్టు పరీక్షల కోసం ఓ అభ్యర్థి అప్లికేషన్ దరఖాస్తు చేసుకోగా, అతనికి వచ్చిన హాల్‌టికెట్‌పై కుక్క ఫోటో ఉన్నది. దీంతో బీహార్ జిల్లా కోర్టు పరీక్షా విధానంపై విమర్శలు వెల్లువెత్తాయి. వివరాల్లోకి వేళ్తే.. రితేశ్ కుమార్ అనే అభ్యర్థి నాలుగేళ్ల క్రితం సివిల్ కోర్టులో ప్యూన్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అడ్మిట్ కార్డు(హాల్‌టికెట్)లో కుక్క ఫోటో చూసి షాక్ తిన్నాడు. హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసిన తర్వాత తన ఫోటో స్థానంలో కుక్క ఫోటో ఉన్నట్లు గుర్తించానన్నారు. ఈ ఫోటో చూసి తాను షాక్‌కు గురైనట్లు చెప్పాడు.కోర్టు పరీక్షలు నిర్వహిస్తున్న రిక్రూట్మెంట్ బోర్డుకు ఫిర్యాదు చేశాడు. తప్పును సవరించాలని అతను డిమాండ్ చేశాడు. మార్చి 15వ తేదీన బీహార్ సివిల్ కోర్టు రిక్రూట్మెంట్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అడ్మిట్ కార్డుతో పాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తీసుకెళ్లాల్సి ఉంటుంది.

# మిగ్-29 యుద్ధ విమానంలో విహరించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్..



**న్యూఢిల్లీ: మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
సరిహద్దుల్లో సంసిద్ధతను భారత వైమానిక దళం ప్రదర్శించింది. భారతీయ వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ . మిగ్-29 యూపీజీ మల్టీరోల్ యుద్ధ విమానాహాలో విహరించారు. వెస్టన్ ఎయిర్ కమాండ్ ప్రాంతానికి చెందిన ఓ ఎయిర్‌బేస్ నుంచి ఆయన ఇవాళ మిగ్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. సున్నితమైన సెక్టార్ల వద్ద సెక్యూర్టీ ఆపరేషన్స్ పరీక్షించారు. ఫైటర్ పైలట్ దుస్తుల్లో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ... అప్‌గ్రేడ్ చెందిన మిగ్-29 విమానంలో ఒంటరిగా సోర్టీ నిర్వహించారు. ఐఏఎఫ్ మిగ్-29 దళంలో అత్యాధునిక వర్షన్‌కు చెందిన మిగ్-29 యూపీజీ మోడల్ యుద్ధ విమానం జత కూడింది.

# తలేఘూన్ అణు కేంద్రం ధ్వంసం



**టెల్ అవివ్ మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
ఇరాన్‌లో ఉన్న ఓ న్యూక్లియర్ కేంద్రాన్ని తాజా దాడుల్లో ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళాలు పేర్కొన్నాయి. ఆ కేంద్రం నుంచి ఇరాన్ అణ్వాయుధాలను డెవలప్ చేస్తున్నదని, కీలకమైన పరీక్షలు చేపడుతున్న ఆ కేంద్రంపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న తలేఘూన్ కాంపౌండ్‌పై ఇజ్రాయెల్ వైమానిక దళాలు దాడి చేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది. ఈ కేంద్రం నుంచి ఇరాన్ ఇటీవల కాలంలో అత్యాధునిక విస్పోటక పదార్థాలను తయారు చేసినట్లు ఐడీఎఫ్ ఆరోపించింది.ఏఎంఏడీ ప్రాజెక్టు కోసం ఇక్కడే అత్యంత సున్నితమైన పరీక్షలు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. అణ్వాయుధాల తయారీ కోసం ఇరాన్ అత్యంత రహస్యంగా అమద్ ప్రాజెక్టును చేపడుతున్న విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ ప్రకారం.. అమద్ ప్రాజెక్టులో భాగంగా 1989 నుంచి 2003 వరకు తలేఘూన్ కేంద్రంలో ఇరాన్ అణ్వాయుధాలు డెవలప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2024 అక్టోబర్‌లో జరిగిన దాడిలో కూడా తలేఘూన్ కాంపౌండ్ దెబ్బతిన్నది. అయితే ఈ కాంపౌండ్‌ను మళ్లీ పునర్ నిర్మిస్తున్నారని తెలిసిందని, ఈ నేపథ్యంలో దాన్ని టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ మిలిటరీ చెప్పింది. తలేఘూన్ అణు కేంద్రం నుంచే ఇరాన్ అణ్వాయుధాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయని ఇజ్రాయెల్ ఆరోపించింది.

# కేరళ సాక్షిగా 'కుంభమేళా మోనాలిసా' ప్రేమ వివాహం

**తిరువనంతపురం మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
కుంభమేళా మోనాలిసాగా ప్రఖ్యాతి పొందిన భోస్లే బుధవారం ప్రేమ వివాహం చేసుకున్నారు. కేరళ రాజధాని తిరువనంతపురం సమీపంలోని శ్రీ నైనార్ దేవాలయం వేదికైంది. ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మహారాష్ట్రకు చెందిన ఫర్మాన్ ఖాన్‌ను ఆమె పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ ఎనిమిది నెలలుగా ప్రేమలో ఉన్నారు. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో ఫొటోల ద్వారా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన మోనాలిసా భోస్లే సోషల్ మీడియాలో వైరల్‌గా మారారు. ఆమె ఒక సినిమా షూటింగ్ కోసం కేరళ వచ్చారు. ఆమె ప్రేమ



విషయం తెలిసి, కేరళలో షూటింగ్ నుంచి మోనాలిసాను ఇంటికి తీసుకెళ్లేందుకు ఆమె తండ్రి అక్కడకు చేరుకున్నారు. విషయం తెలిసిన మోనాలిసా.. ఫర్మాన్‌తో కలిసి తంపనూర్ పోలీసులను ఆశ్రయించారు. ఆమె వయసు 18 ఏళ్లు దాటాయనే విషయాన్ని గుర్తించిన పోలీసులు ఆమెకు రక్షణ కల్పించారు. స్థానిక యువకులు ఈ వివాహ ఏర్పాట్లు చేశారు. ఎంపి ఎఎ రహీమ్, కేరళ మంత్రి వి. శివన్‌కుట్టి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ తదితర ప్రముఖులు వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో కొత్త దంపతులు మాట్లాడుతూ కేరళ కంటే ఉత్తమ ప్రాంతం దేశంలో లేదని అన్నారు. 'ఎక్కడైనా మీది ఏ మతం అని అడుగుతారని, కేరళలో మాత్రం మీరు సురక్షితంగా ఉన్నారా.. అని' అడుగుతారని ప్రశంసించారు.

# ప్రతి దేశానికి పునాది దాని ఇంధన భద్రతే


**న్యూఢిల్లీ: మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుపై లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. గురువారం లోక్‌సభ లో మాట్లాడిన ఆయన.. ఇంధన భద్రత విషయంలో భారత ప్రభుత్వం అమెరికా తో రాజీపడిందని ఆరోపించారు. ఈ రాజీతో వివిధ చమురు సరఫరాదారులతో తన సంబంధాలను నిర్ణయించే అధికారాన్ని అమెరికాకు కట్టబెట్టినట్లు అయ్యిందని ఆయన మండిపడ్డారు.అమెరికా -- ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంతో భారత్ సుదీర్ఘ పరిణామాలన ఎదుర్కోవాల్సి వస్తుందని



రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం హోర్ముజ్‌జలసంధి గుండా జరుగుతుందని, జీవనాడి లాంటి ఆ జలసంధి మూతపడటం తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని అన్నారు. ముఖ్యంగా భారత్‌కు ఎక్కువ ఇబ్బందులు కలుగనున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎందుకంటే మనం దిగుమతి చేసుకునే చమురు, సహజవాయువులో సింహభాగం హోర్ముజ్ జలసంధి నుంచే సరఫరా అవుతుందని చెప్పారు. నొప్పి ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని, గ్యాస్ కొరత కారణంగా ఇప్పటికే రెస్టారెంట్‌లు మూతపడుతున్నాయని రాహుల్‌గాంధీ అన్నారు. వీధి వ్యాపారులపై గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపుతున్నదని వ్యాఖ్యానించారు. ప్రతి దేశానికి పునాది దాని ఇంధన భద్రతేనని ఆయన నొక్కి చెప్పారు. ఇది చిన్న విషయం కాదని, మనం ఎక్కడి నుంచి చమురు కొనుగోలు చేయాలి..? రష్యా నుంచి కొనాలా వద్దా అనేవి అమెరికా నిర్ణయించడం ప్రమాదకరమని అన్నారు.

# సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులు కారు :

**న్యూఢిల్లీ: మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
విపక్షాలు తనకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయిన నేపథ్యంలో ఇవాళ (గురువారం) లోక్‌సభ స్పీకర్ (హాశీని ఝుఎష్ణు రాజూాఝునెవతీ) ఓం బిర్లా స్పందించారు. తాను ఎల్లప్పుడూ ప్రతి ఎంపీకి సభలో మాట్లాడే అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. సభ నియమ నిబంధనలకు ఎవరూ అతీతులుకారని చెప్పారు.లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీని ఉద్దేశించి స్పీకర్ ఓంబిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఎంపీల మైక్రోఫోన్లను నియంత్రించాననే ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. సభలో ఎవరికీ ప్రత్యేక వెసులుబాట్లు ఉండవని చెప్పారు. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు నడుస్తాయన్నారు. ప్రధాని, మంత్రులు కూడా



ఏదైనా ప్రకటన చేయడానికి ముందు సభ నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలని చెప్పారు. మైక్రోఫోన్‌లను ఆన్ లేదా ఆఫ్ చేయడానికి స్పీకర్ దగ్గర ఎలాంటి బటన్ ఉండదని అన్నారు. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసని చెప్పారు. మాట్లాడేందుకు అనుమతి ఉన్న సభ్యుడికి మాత్రమే మైక్రోఫోన్ ఆన్ అవుతుందని తెలిపారు. తనపై విపక్షాలు కొంతకాలంగా చేస్తున్న విమర్శలకు ఓంబిర్లా ఈ విధంగా సమాధానం ఇచ్చారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రెండ్రోజుల చర్చ అనంతరం బుధవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. మూజువాని ఓటుతో అది వీగిపోయింది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబెపై చర్యలు చేపట్టకపోవడం లాంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. అవిశ్వాస తీర్మానం ప్రక్రియ పూర్తయ్యేవరకు సభకు దూరంగా ఉన్న స్పీకర్.. తీర్మానం వీగిపోగానే మళ్లీ యథావిధిగా విధులకు హాజరయ్యారు.

# ఒక్క రాత్రే 200 రాకెట్లు ఫైర్ చేసిన హిజ్‌బుల్లా..

**జెరుసలాం మార్చి 12 (సామాజిక తెలంగాణ)**
లెబనాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ హిజ్‌బుల్లా.. బుధవారం రాత్రి ఇజ్రాయెల్‌పై భీకర దాడికి పాల్పడింది. ఒక్క రాత్రే సుమారు 200 రాకెట్ల ను ఫైర్ చేసింది. ఇజ్రాయెల్ ఉత్తరం వైపున ఆ దాడి జరిగింది. దీంతో వేల సంఖ్యలో ఇజ్రాయిలీ ప్రజలు ప్రాణ రక్షణ కోసం షెల్టర్లకు వెళ్లి దాక్కున్నారు. హిజ్‌బుల్లా గత వారం రోజుల్లో తొలి సారి భారీ ఎత్తున బుధవారం రాత్రి దాడి చేసింది. ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పై హిజ్‌బుల్లా అటాక్ చేస్తున్న విషయం తెలిసిందే.బుధవారం జరిపిన దాడిలో తొలుత ఒకేసారి సుమారు వందకు పైగా రాకెట్లను ఫైర్ చేసింది. రాత్రి 8 గంటలకు ఆ ఫైరింగ్ జరిగింది. మరో వైపు అదే సమయంలో ఇరాన్ ఓ క్షిపణిని ఇజ్రాయెల్ సెంట్రల్ రీజియన్ దిశగా ఫైర్ చేసింది. ఆ




తర్వాత రాత్రంతా హిజ్‌బుల్లా వరుసగా రాకెట్లను విడిచింది.హిజ్‌బుల్లా చేసిన దాడి గురించి తమ ప్రజలకు సరైన సమయంలో అప్‌డేట్ ఇవ్వలేకపోయినట్లు ఐడీఎఫ్ అంగీకరించింది. సోషల్ మీడియాలో వ్యాపించిన సమాచారాన్ని ఇజ్రాయిలీ దళాలు తొలుత పట్టించుకోలేదని తెలిసింది. హిజ్‌బుల్లా దాడి ప్రారంభమైన తర్వాత ఉత్తర ప్రాంత ప్రజలకు మిలిటరీ అప్‌డేట్ సందేశాలు పంపినట్లు తెలిసింది. అయితే అప్పటికే ఆలస్యం జరిగిందని, కానీ ముందుగానే ప్రజలకు హిజ్‌బుల్లా రాకెట్ దాడి గురించి వివరించాల్సి ఉందని ఐడీఎఫ్ అభిప్రాయపడింది.ఐడీఎఫ్ ప్రకారం బుధవారం రాత్రి హిజ్‌బుల్లా సుమారు 200 రాకెట్లను , 20 డ్రోన్లను ఫైర్ చేసింది. దీంట్లో చాలా వరకు రాకెట్లను ఇంటర్‌సెప్ట్ చేశారు. కొన్ని రెసిడెన్షియల్ ప్రాంతాల్లో పడ్డాయి. అన్ని డ్రోన్లను అడ్డుకున్నారు. రాకెట్లు దూసుకొస్తున్న సమయంలో.. లాంచర్లను గుర్తించి వాటిని పేల్చివేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది.



# 6 ప్యాక్ లుక్‌తో ఫ్యాన్స్‌కి షాక్ ఇచ్చిన చైతు

## ‘వృష కర్మ’ కోసం బీస్ట్ మోడ్‌లోకి మారిన నాగ చైతన్య ..

అక్కినేని వారసుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుసగా వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన ‘వృష కర్మ’ గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. “దీవఅఅస్త్రూాతీయబఅ” అనే క్యాప్షన్‌తో ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే ‘వృష కర్మ’ కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ఫైర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. “అన్నా నీ మూవీ కోసం వెయిటింగ్”, “వృషకర్మ ఇన్ యాక్షన్”, “చైతు ట్రాన్స్‌ఫర్మేషన్ సూపర్” అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అలాగే ఈ కొత్త లుక్‌కు కారణమైన ఫిట్‌నెస్ ట్రైనర్ కూడా స్పందిస్తూ, “నీ ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో నా వంతు పాత్ర ఉన్నందుకు సంతోషంగా ఉంది” అని రిప్లై ఇవ్వడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ‘వృష కర్మ’ సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.




# ఆసక్తికరంగా ‘దీవాన’ టీజర్

## ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు!..

టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం ‘దీవాన’. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే ‘దీవాన’ గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా “ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు” మరియు “అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా” వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హా మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది.

# హిట్ కోసం ఎదురుచూస్తున్న బ్యూటీ..

చాలా మంది ముద్దుగుమ్మలు సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్ గా ఉంటారు. ఈ మధ్య కాలంలో సినిమాల్లో హీరోయిన్స్ పాత్రలు చాలా వరకు తక్కువ ఉంటున్నాయి. దాంతో సినిమాలతో పాటు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. రకరకాల ఫోటో షూట్స్, వీడియోలతో అభిమానులను కవ్విస్తున్నారు.అలాంటి వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. టాలీవుడ్‌లో ఇప్పుడిప్పుడే హీరోయిన్‌గా మంచి గుర్తుంపు తెచ్చుకుంటుంది ఈ చిన్నది విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ సినిమాలు చేస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఇక సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే ఈ చిన్నది. రోజు రోజుకు గ్లామర్ డోస్ పెంచేస్తూ నెటిజన్స్‌ను దర్శక నిర్మాతలను ఆకర్షిస్తుంది.పై ఫోటో క్యూట్ లుక్‌లో కనిపిస్తున్న ముద్దుగుమ్మ ఎవరో గుర్తుపట్టారా.? చేసింది తక్కువ సినిమాలే కానీ క్రేజ్ మాత్రం విపరీతంగా సొంతం చేసుకుంది. గ్లామర్ డోస్ తో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తున్న ఈ హీరోయిన్ ఎవరో కనిపెట్టారా.? ఆమె మరెవరో కాదు టాలీవుడ్ క్రేజీ బ్యూటీ.. తెలుగమ్మాయి అనన్య నాగళ్ల.ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కెరీర్ బిగినింగ్ లో చిన్న చిన్న పాత్రలు చేసింది అనన్య. మల్లేశం సినిమాతో హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. మల్లేశం సినిమాలో అనన్య తన నటనతో ఆకట్టుకుంది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్‌తో మంచి క్రేజ్ తెచ్చుకుంది.బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూనే ఉంది అనన్య. కానీ ఆ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర అంతగా ప్రభావం చూపలేకపోతున్నాయి. ప్రస్తుతం అనన్య భారీ ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది. ఇక సోషల్ మీడియాలో అనన్య చేసే రచ్చ అంతా ఇంతా కాదు. గ్లామర్ డోస్ పెంచి కుర్రాళ్లను కవ్విస్తుంది అనన్య. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన పిక్స్ నెటిజన్స్ కు కిర్రెక్కిస్తున్నాయి.





# కీరవాణి కొడుకుతో పీకల్లోతు ప్రేమ...

## బలగం హీరోయిన్ పెళ్లి వార్తలు వైరల్

తెలుగు సినీ పరిశ్రమలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కావ్య కళ్యాణ్ రామ్ ఆ తర్వాత హీరోయిన్‌గా మారి తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. చిన్నప్పుడే పలు సినిమాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, పెద్దయ్యాక హీరోయిన్‌గా కూడా వరుస అవకాశాలు అందుకుంటోంది. హీరోయిన్‌గా ఆమె చేసిన మసూద, బలగం, ఉస్తాద్ వంటి సినిమాలు మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయి. ముఖ్యంగా ‘బలగం’ సినిమా భారీ విజయాన్ని సాధించడంతో కావ్యకు మరింత క్రేజ్ వచ్చింది. ప్రస్తుతం కూడా ఆమె పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలో కూడా కావ్య చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన ఫోటోలు, వీడియోలు పంచుకుంటూ అభిమానులతో టచ్‌లో ఉంటోంది. ఆమె పోస్ట్ చేసే ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.ఇదిలా ఉంటే ప్రస్తుతం కావ్య కళ్యాణ్ రామ్ పెళ్లి గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి పెద్ద కుమారుడు, గాయకుడు ,సంగీత దర్శకుడు కాళ భైరవతో కావ్య ప్రేమలో ఉన్నారని వార్తలు వినిపిస్తున్నాయి. కాల భైరవ మొదట గాయకుడిగా తన కెరీర్‌ను ప్రారంభించి మంచి గుర్తింపు సంపాదించాడు. తర్వాత సంగీత దర్శకుడిగా కూడా తన ప్రతిభను చూపిస్తూ వరుసగా సినిమాలకు సంగీతం అందిస్తున్నాడు. తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో మంచి స్థానం సంపాదించుకుంటున్నాడు. ఇక గత కొన్నేళ్లుగా కాల భైరవ మరియు కావ్య కళ్యాణ్ రామ్ మధ్య స్నేహం ప్రేమగా మారిందని టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. వీరిద్దరూ చాలా కాలంగా డేటింగ్ చేస్తున్నారని, ఇప్పటికే ఇరు కుటుంబాలు కూడా వారి ప్రేమను అంగీకరించాయని వార్తలు వస్తున్నాయి. ఇక ఈ ఏడాదిలోనే వీరి పెళ్లి జరిగే అవకాశం ఉందని కూడా సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కీరవాణి కుటుంబంలో మరో పెళ్లి కూడా జరిగింది. ఆయన చిన్న కుమారుడు సింహా కోడూరి ప్రముఖ నటుడు మురళి మోహన్ మనవరాలిని వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు పెద్ద కుమారుడు కాల భైరవ పెళ్లి కూడా జరగబోతుందన్న వార్తలు వినిపిస్తుండటంతో ఈ విషయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇప్పటివరకు ఈ వార్తలపై కావ్య కళ్యాణ్ రామ్ లేదా కాల భైరవ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో వీరి ప్రేమ, పెళ్లి వార్తలు నిజమా కాదా అన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# నాకు ఎక్కువగా అలాంటి పాత్రలే వస్తున్నాయి.

## నటి హరితేజ ఇంట్రెస్టింగ్ కామెంట్స్



తెలుగు ప్రేక్షకులకు హరితేజ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. సీరీయల్స్ ద్వారా మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈమె.. పలు టీవీషోలో కనిపించి మెప్పించింది. అలాగే సినిమాలతో పాటు బిగ్ బాస్ గేమ్ షోలోనూ కనిపించి ఆకట్టుకుంది. మనసు మమత, రక్త సంబంధం, అభిషేకం, తాళి కట్టు శుభవేళ, శివరంజని, కన్యాదానం ఇలా పలు సీరియల్స్ లో నటించింది హరితేజ. అలాగే సినిమాల్లోనూ చక్కటి పాత్రలు చేసి మెప్పించింది. ముఖ్యంగా అ ఆ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అఆ సినిమాతో వెండితెర పై మంచి గుర్తింపు తెచ్చుకుంది హరితేజ. ఈ సినిమాలో హీరోయిన్ సమంత పనిమనిషిగా నటించింది. అలాగే తన కామెడీ టైమింగ్ తో ఆకట్టుకుంది హరితేజ.ప్రస్తుతం లేచింది మహిళా లోకం అనే సినిమాలో నటిస్తుంది హరితేజ. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ లో ఆమె మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. మీరు చాలా సినిమాల్లో పనిమనిషి పాత్రల్లోనే కనిపిస్తున్నారు. దానికి ఏదైనా ప్రత్యేకమైన కారణం ఉందా.? అని ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు ఆమె ఆసక్తికర సమాధానం తెలిపారు. ఆ పాత్రకు తాను బ్రాండ్ అంబాసిడర్‌లా మారిపోయానని సరదాగా అన్నారు హరితేజ, కాగా చాలా మంది రచయితలు ఆ పాత్రలు రాస్తున్నప్పుడు నన్నే ఊహించుకుని రాస్తున్నారు. వాళ్ల ఆలోచన మార్చితే నా పాత్రలు కూడా మారుతాయి చెప్పుకొచ్చింది హరితేజ. అలాగే తాను ఇటీవలే వేరే పాత్రలు కూడా చేశానని తెలిపింది.. అయితే ఒక పాత్రతో ముద్రపడితే దాన్ని మార్చుకోవడం కష్టమే.. జనాలకు అలానే ముద్రపడిపోతాము.. ఇక పై ఇలాంటి పాత్రలు తగ్గిపోవచ్చు అని తెలిపింది హరితేజ. అదేవిధంగా ఒకేరకమైన పాత్రలు చేయాలని నేను ఎప్పుడూ ఫిక్స్ అవ్వను.. ఏపాత్ర వచ్చినా దానికి న్యాయం చేయాలనే చూస్తాను.. ఇతర పాత్రలు వస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నాను అని తెలిపింది హరితేజ.

Printed published owned by P Venkataramana H No 150/2 Road no 4 Midhani colony injapur abdullapur met mandal Rangareddy dist TS 501510. printed At Kiran< printers H No 150/2 Road No 4 abdullapur met mandal Rangareddy dist Ts 501510.published from Podila Publications editor P Venkataramana RNi No Aptel/ 20011/39851 mobile no 9133399979/7330899979 email. Samajikanews10@gmail.com